RNI No .AP TEL:/2017/73004

# జనదీపిక

www.janadheepikasklm@gmail.com

దిన పత్రిక

•సంపుటి : 10 •సంచిక : 145 •శ్రీకాకుళం •విజయనగరం •విశాఖపట్టణం •గుంటూరు

•ఎడిటర్ : చిన్నారావు సున్నపు •శుక్రవారం 11 సెప్టెంబర్ 2026 •పేజీలు : 8 •వెల : 2/-




# ఒక సందర్శన ! కొన్ని ప్రక్షాళనలు



పుణ్యపువీధి పి.హెచ్.సిలో డిఎం అండ్ హెచ్ ఓ డా.నరేష్ కుమార్



నాడు



నేడు

-- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.నరేష్ మార్క్!

-- పుణ్యపు వీధి పి.హెచ్.సికి రెగ్యులర్ వైద్యాధికారిణి

-- మున్సిపల్ సేవల నుంచి హెల్త్ అసిస్టెంట్లుకు విముక్తి

( సున్నపు చిన్నారావు )

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో నూతన అధికారి డాక్టర్ నరేష్ కుమార్ సమీక్షలు,స్పందనలు, నిర్ణయాల్లో తనదైన ముద్రను వేస్తున్నారు. విశాఖ మహానగరంలో ఉన్న అనుభవంతో, జిల్లా అధికారి బాధ్యతలు తొలిసారిగా స్వీకరించినా, కొత్తదనం ఏమీలేనట్టుగానే పాలనా పగ్గాలు చేపట్టారు. సమీక్షల పూర్తి చేసి, వెంటనే స్పందించి, అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ లో ఆరు పి.హెచ్.సిలు ఉన్నాయి.ఇవి గతంలో రిమ్స్ కేంద్రంగా పనిచేసేవి.నగర అవసరాలను దృష్టిలో ఉంచుకొని, కొన్నేళ్ళ క్రితం సిబ్బందిని సర్దుబాటు చేశారు.కానీ,వీటి సేవల వినియోగమే తప్ప,వాటి మౌళిక సదుపాయాల గురించి కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్, కమిషనర్ పట్టించుకున్న దాఖలాలు లేవు.గత డిఎం అండ్ హెచ్ ఓ కూడా, ఇష్టానుసారం పోస్టింగ్స్, డెప్యుటేషన్స్ ఇచ్చేసి,తన వరకూ ఏదో చక్కబెట్టుకున్నారనే విమర్శలు ఉన్నాయి.డా. నరేష్ కుమార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత, బుధవారం తొలిసారిగా, అర్బన్ ఆరోగ్య కేంద్రాల పనితీరు సమీక్షలో భాగంగా, పుణ్యపు వీధి కేంద్రం సందర్శించారు. పేరుకే ఇది పుణ్యపు వీధి కానీ,అంతా బర్మా కాలనీ అంటారు.ఇక్కడ ఆరోగ్య కేంద్రంలోకి వెళ్లాలంటే, ముక్కు మూసుకుని వెళ్లాలి.శుభ్రతకు నోచుకోని మురికి ఊబి లాంటి కాలువను దాటి వెళ్లాలి.ఎన్నిసార్లు ఇక్కడి సిబ్బంది ఫిర్యాదు చేసినా,పట్టించుకునేవారే లేరు.బుధవారం మధ్యాహ్నం విజిట్ కు వచ్చిన డా. నరేష్ కుమార్ ఈ పరిస్థితిని చూసి ఆశ్చర్యపోయారు.వెంటనే మున్సిపల్ అధికారికి ఫోన్ చేసి,రేపటికల్లా కాల్వను శుభ్రం చేయాలని చెప్పారు. గురువారం ఉదయమే, సిబ్బంది వచ్చి శుభ్రం చేయడం చూసి,ఆ వీధి నివాసులు ఆనందం వ్యక్తం చేశారు.

## వైద్యాధికారిణి నియామకం

ఇక్కడ ఆరోగ్య కేంద్రం ఉన్నా, రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్ లేరు.కాంట్రాక్టు నియామకాలతో కొందరు వచ్చి రెగ్యులర్ కాగానే వెళ్లిపోయారు.గత రెండేళ్ల నుంచి సిబ్బందితోనే రోగులకు సేవలు అందాయి.రిమ్స్‌లో పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రం (యుఎఫ్ డబ్ల్యూ సి) లో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు ఉన్నారు.పుణ్యపువీధి కేంద్రం జీతభత్యాలు మంజూరు చేసే అధికారం ( డ్రాయింగ్ పవర్ ) ఆ ఇద్దరిలో ఒకరిది.కానీ,ఈ కేంద్రంలో వైద్యసేవలు వారు అందించరు. ఒక వైద్యాధికారిని జిల్లా కోర్టు ప్రాంగణంలో సేవలు అందించాలని గత డిఎం అండ్ హెచ్ ఓ మౌఖికంగా ఆదేశించారు.మరో మహిళా అధికారిని తొగరాం కేంద్రానికి డెప్యుటేషన్ పై పంపించారు.కానీ,ఆమె వెళ్లలేదని తెలుస్తోంది.రిమ్స్ సెంటర్ లో వాక్సినేషన్ మాత్రమే ఉంటుంది.ఆ బాధ్యత మిగిలిన సిబ్బంది చూస్తారు.ఈ పరిస్థితిని పుణ్యపు వీధి కేంద్రం సిబ్బంది వివరించగానే, డాక్టర్ నరేష్ కుమార్ వెంటనే స్పందించారు. ఇక్కడి నుంచి కార్యాలయానికి వెళ్లి,తొగరాం వైద్యాధికారిణిని పుణ్యపు వీధి కేంద్రంలో నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## హెల్త్ అసిస్టెంట్లుకు విముక్తి

అర్బన్ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే హెల్త్ అసిస్టెంట్స్ లో కొందరిని, మున్సిపల్ సేవలకు వినియోగిస్తున్నారు.ఈ విషయం తెలిసి, వెంటనే వారిని తమ శాఖకు పంపించాలని డా. నరేష్ కుమార్ సంబంధిత అధికారులకు లేఖ రాసినట్టు తెలిసింది.

# పొందూరులో హోం స్టే టూరిజం!

-- విశాఖలో కొత్తగా 16 స్టార్ హోటళ్లు

-- రూ.5589 కోట్ల పెట్టుబడి

--10 వేల మందికి ఉపాధి

-- నవంబర్ నుంచి క్రూయిజ్ రెగ్యులర్ సర్వీసులు

--జాతీయ టూరిస్ట్ సదస్సులో మంత్రి దుర్గేష్





**జనదీపిక,విశాఖపట్నం :** శ్రీకాకుళం జిల్లాలోని పొందూరును, అనకాపల్లి జిల్లాలోని ఏటికొప్పాకను ‘ హోం స్టే ’ టూరిజానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. టూరిస్టులు ఒక రోజంతా అక్కడ ఉండి, ఉత్పత్తి జరిగే విధానాన్ని నమోదు చేసుకోవడానికి వీలుగా, వారు స్థానికుల ఇళ్లల్లోనే భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయడాన్ని ‘ హోం స్టే ’ టూరిజం అంటారు. టూరిస్టులు ఆ ఖర్చులన్నీ భరిస్తారు. ఈ తరహా పర్యాటక రంగం పట్ల ఎక్కువమంది ఆసక్తి చూపుతున్నారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ గురువారం విశాఖలో జరిగిన ప్రెస్ మీట్ లో చెప్పారు. నోవాటెల్ హోటల్లో జరుగుతున్న జాతీయ టూరిస్ట్ ఆపరేటర్ల సదస్సులో మంత్రి మరెన్నో విషయాలు వెల్లడించారు. రూ.5589 కోట్ల పెట్టుబడితో, కొత్తగా 16 స్టార్ హోటళ్లు గ్రౌండింగ్ అవుతున్నాయని, ఇవి పూర్తయితే,980 గదులు టూరిస్టులకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. వీటివల్ల దాదాపు పదివేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రిషికొండ భవనాలను లీజుకి ఇచ్చే విషయంలో, మంత్రివర్గ ఉప సంఘం ఒక నివేదిక ఇచ్చినట్టు తెలిపారు. అయితే, 7.50 ఎకరాలు సి ఆర్ జెడ్ లో ఉన్నాయని, 1.5 ఎకరాలు మాత్రమే బయట ఉన్నాయని చెప్పారు. తీర ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి కొత్త ప్రతిపాదనలు ఉన్నట్టు చెప్పారు. కార్డిలియో క్రూయిజర్ ప్రస్తుతం ఏడాదికి మూడు, నాలుగు సార్లు మాత్రమే వస్తుందని, నవంబర్ నుంచి రెగ్యులర్ సర్వీస్ అందించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వివరించారు. కార్ వాన్ టూరిజం అమలు చేయడానికి ఇంకా సమయం ఉందని, ఏజెన్సీలు గిట్టుబాటు కావడం లేదని చెబుతున్నట్టు తెలిపారు. తీర ప్రాంతంలో వెల్ నెస్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్టు, బాబా రాందేవ్ సంస్థ ముందుకు వచ్చినట్టు చెప్పారు. సింహాచలం దేవస్థానంలో ‘ ప్రసాద్ ’ పథకం కింద ఇచ్చిన ఈ-వ్యాన్స్ సక్రమంగా వినియోగం కావడం లేదని, భవానీ ద్వీపానికి తరలించే ఆలోచన ఉందని చెప్పారు.

## ఏజెన్సీ టూరిజానికి 1/70 చట్టం ఇబ్బందులు

గిరిజన, అటవీ ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి చట్టపరంగా కొన్ని ఇబ్బందులు వల్ల చర్యలు తీసుకోలేకపోతున్నట్టు మంత్రి దుర్గేష్ చెప్పారు. అరకు, పాడేరు, లంబసింగి వంటి ప్రాంతాల్లో ప్రతిపాదనలు పెండింగ్ లో ఉన్నట్టు తెలిపారు. ప్రత్యేకంగా 1/70 చట్టం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నట్టు చెప్పారు. అరకు లోయ, లంబసింగి వంటి ప్రాంతాలకు ‘ సీ ప్లేన్ ’ టూరిజం అభివృద్ధి చేస్తామని, త్వరలో అవి అందుబాటులోకి వస్తాయని ఆయన వివరించారు. ‘ ఉడాన్ ’ పథకం కింద ఈ టూరిజాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు.

మంత్రి కందుల దుర్గేష్

# సంపాదకీయం

## తమిళ సంచలనం

తమిళనాడులో రెండు సంప్రదాయ ద్రవిడ పార్టీలను ఓడించి కొత్త పార్టీగా టీవీకేను అధికారంలోకి తెచ్చిన ఘనత దళపతి విజయ్ దే. గత ఆరు దశాబ్దాలుగా చేతులు మారుతూ వస్తున్న అధికారాన్ని అవకాశాన్ని డీఎంకే అన్నా డీఎంకేలకు దక్కనీయకుండా విజయ్ చేశారు. ప్రజలకు సరికొత్త ఆల్టర్నేషన్ గా తన పార్టీని చూపించారు. ఇక విజయ్ పార్టీకి సీట్లు కొన్ని తగ్గినా కాంగ్రెస్ ఇతర మిత్రులతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దానికి ఇపుడు కొత్త కూటమిగా పేరు కూడా పెట్టారు, దీంతో దీర్ఘకాలంలో ఈ కూటమి ద్వారా తమిళనాడులో బలమైన రాజకీయ వేదికను ఏర్పాటు చేసుకుని అధికారాన్ని పటిష్టం చేసుకోవాలని ముఖ్యమంత్రి విజయ్ చూస్తున్నారు. విజయ్ ఈ విధంగా రాజకీయ ఎత్తుగడలకు దిగడంతో సంప్రదాయ రాజకీయ శక్తులు ఇప్పటిదాకా ప్రత్యర్థులుగా ఉన్న డీఎంకే అన్నా డీఎంకేకి పెను సవాల్ గా మారుతోంది. ఇక తమిళనాడు రాజకీయ ముఖ చిత్రం 2026 మే నెలలో జరిగిన ఎన్నికల తర్వాత పూర్తిగా మారిపోయింది. మూడు పార్టీల వ్యవస్థగా అది పరిణమించింది. అంటే ఇక మీదట జరిగే ఏ ఎన్నిక అయినా త్రిముఖ పోరు అన్న మాట. త్రిముఖ పోరు అంటే అధికారంలో ఉన్న పార్టీలకు గెలుపు అవకాశాలు రెట్టింపు అవుతాయి. అదే విపక్షంలో ఉన్న పార్టీలకు ఓట్లు చీలి పీఠానికి ఎప్పటికీ దూరంగానే ఉండిపోతాయి. రాజకీయంగా ఢక్కామెక్కీలు తిన్న డీఎంకే అధినేత స్టాలిన్ అలాగే అన్నా డీఎంకేకి చెందిన అధినాయకుడు పళని స్వామికి తెలియనిది కాదు, దాంతో చిరకాల ప్రత్యర్థులు ఇద్దరూ ఇపుడు దీర్ఘ కాల వ్యూహాలకు పదును పెడుతున్నారు. దాంతో గత విభేదాలను మరచి ఒక వేదిక మీదకు వచ్చే అవకాశాలను కూడా తీవ్రంగానే పరిశీలిస్తున్నారు అని అంటున్నారు. ఇదిలా ఉంటే తమిళనాడులో విజయ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విపక్షాలు అన్నీ ఒక వేదికగా ఏర్పడాలని మాజీ సీఎం పళని స్వామి అంటున్నారు. ప్రజల కోసం అవసరం అయితే డీఎంకే అధినేత స్టాలిన్ తో చేతులు కలిపేందుకు కూడా సిద్ధమని పళని స్వామి ప్రకటించడం ఇపుడు రాజకీయంగా కాక పుట్టిస్తోంది. రెండు భిన్న పార్టీలు చిరకాల వైరం ఉన్న పార్టీలు ఒక్కటి అవుతామని చెప్పడం చూస్తూంటే విజయ్ ప్రభావం తమిళనాడులో ఎంతగా ఉందో అర్థం అవుతోంది అని అంటున్నారు. ప్రజా సమస్యలు అని బయటకు చెబుతున్నా రాజకీయ అస్తిత్వం కోసమే ఈ విధంగా చేతులు కలపాలని కోరుకుంటున్నారు అని విశ్లేషణలు ఉన్నాయి. టీవీ కేకు వ్యతిరేకంగా తాము ఏర్పాటు చేయబోయే కూటమిలోకి డీఎంకే వస్తే స్వాగతిస్తామని పళని స్వామి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక రాష్ట్ర శాసనసభలో డీఎంకే ప్రధాన ప్రతిపక్షంగా ఉంది. ఆ తరువాత ప్లేస్ లో పళనిస్వామి నాయకత్వంలో అన్నా డీఎంకే ఉంది. అధికార టీవీకే నిరంతరం ద్రవిడ పార్టీలను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తోంది. డీఎంకే ప్రభుత్వం అవినీతి మీద కూడా ముఖ్యమంత్రి విజయ్ లేటెస్ట్ గా చేసిన విమర్శలు సభను ఒక్కసారిగా వేడెక్కించాయి. దాంతో డీఎంకే ఎమ్మెల్యేలు సభలోనే నిరసన తెలిపారు. ఇలా ఢీ అంటే ఢీగా సాగుతున్న తమిళ రాజకీయంలో విజయ్ ని పక్కన పెట్టేందుకు స్టాలిన్ పళని స్వామి చేతులు కలుపుతారా అన్నదే చర్చగా ఉంది. రాజకీయాల్లో ఏమైనా జరగవచ్చు అన్నది ఉంది. ఇపుడు రెండు ద్రవిడ పార్టీల అస్థిత్వానికే ముప్పు వాటిల్లుతున్న నేపథ్యంలో ఉమ్మడిగా ముందుకు వచ్చి విజయ్ ని రాజకీయంగా కట్టడి చేయవచ్చు అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# పాపులారిటీ ఉందని తొందరపడితే... సీజేపీ నేతలకు ఝలక్!




ఇప్పుడు ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాలోనే ఎక్కువ కాలం గడిపేస్తున్నారు. ఆఫీసులో ఉన్నా.. ప్రయాణాలు చేస్తున్నా.. ఇంట్లో ఉన్నప్పుడు.. చివరికి బెడ్ రూపంలో పడుకునే ముందు, నిద్ర లేచిన తర్వాత ఇలా రోజులో సగం కంటే ఎక్కువ సమయం సోషల్ మీడియాతోనే కాలక్షేపం చేస్తున్నారు. చాలా మందికి ఇదో వ్యసనంలా మారిపోయింది. రోజూ ఏదో ఒక పోస్టు పెట్టాలని కొందరు.. పెట్టిన పోస్టుకు లైకులు వచ్చాయా? రాలేదా? అని మరికొందరు నిత్యం అదేపనిగా సోషల్ మీడియాను ఫాలో అవుతుంటారు. ఇలా కొందరు పాపులర్ అవుతుంటే.. మరికొందరు ఆ పాపులారిటీని కొనసాగించడానికి తప్పులు చేస్తూ చిక్కుల్లో పడుతున్నారు. దీనికి సోషల్ మీడియా సంచలనంగా గుర్తింపు సాధించిన కాక్రోచ్ పార్టీ నేతలు కూడా అతీతులేం కాదని తాజా సంఘటన నిరూపిస్తోంది. విద్యార్థి ఉద్యమంతో దేశవ్యాప్తంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కి విస్తృత గుర్తింపు వచ్చిన విషయం తెలిసిందే. ఎక్స్ లో మొదలైన ఈ వ్యంగ్య పేజీ తర్వాత జెనీ జీ యువత మద్దతుతో క్షేత్రస్థాయి పోరాటంతో విద్యా మంత్రి ఊస్టింగ్ కు కారణమైంది. ఈ క్రమంలో సీజేపీ నాయకులుగా ఎదిగిన అభిజిత్ దీప్కే, ఆశుతోష్, సౌరవ్ రాంకా దేశవ్యాప్తంగా పాపులారిటీ సంపాదించుకున్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ ఉద్యమం తర్వాత మరిన్ని పోరాటాలకు సిద్ధమని చెప్పారు. ఇదే సమయంలో వారి సోషల్ మీడియా అకౌంట్లకు ఫాలోవర్లు విపరీతంగా పెరిగారని అంటున్నారు. జంతర్ మంతర్ ఉద్యమంతో సోషల్ మీడియా సెలబ్రెటీలుగా మారిన ఈ ముగ్గురికి బీజేపీ నేత, ప్రముఖ న్యాయవాది గౌరవ్ భాటియా షాక్ ఇచ్చారు స్వతంత్ర జర్నలిస్టు భరద్వాజ్ ను గౌరవ్ భాటియా విమర్శించినట్లు కొన్ని వీడియోలు వైరల్ అయ్యాయి. వీటిని సీజేపీ నేతలు ముందుగా పార్టీ అకౌంట్లో పోస్టు చేశారని అంటున్నారు. అయితే తాను అనని మాటలను అన్నట్లుగా ఫేక్ కంటెంట్ ను ఏఐ ద్వారా సృష్టించారని, సీజేపీ అకౌంట్లలో ఆ వ్యాఖ్యలను తొలగించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా సీజేపీ నేతలు తనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో సీజేపీ నేత సౌరవ్ దాస్ ఆ వీడియోలను ఎక్స్ నుంచి తొలగించినట్లు చెబుతున్నారు. అయితే మళ్లీ ఏమనుకున్నారో ఏమో గౌరవ్ భాటియా అభ్యంతరం చెప్పిన వీడియోను సీజేపీ నేతలు అభిజిత్, సౌరవ్, ఆశుతోష్ తమ వ్యక్తిగత అకౌంట్లలో పోస్టు చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ముందుగా ఏఐ జనరేటిడ్ వీడియో అని చెబుతూనే సౌరవ్ తన వ్యక్తిగత ఎక్స్ ఖాతాలో షేర్ చేయడమే కాకుండా, మరికొందరికి ఫార్వర్డ్ చేశారని న్యాయవాది భాటియా ఆరోపిస్తున్నారు. సౌరవ్ పోస్టు చేసిన వీడియోలను మిగిలిన ఇద్దరు రీ పోస్టు చేశారని చెబుతున్నారు. దీంతో వివాదం కోర్టుకు వెళ్లింది. తన పరువుకు నష్టం కలిగించారని ఆరోపిస్తూ న్యాయవాది, బీజేపీ నేత భాటియా సీజేపీ నేతలపై రెండు కోట్ల రూపాయలకు పరువు నష్టం దావా దాఖలు చేశారు. భాటియా అభ్యంతరంతో ముందుగా ఎక్స్ నుంచి తొలగించిన సౌరవ్ మళ్లీ తన ఎక్స్ ఖాతాలో ఎందుకు పోస్టు చేశారనేది తెలియాల్సివుందని అంటున్నారు. అయితే సోషల్ మీడియా కంటెంట్ కోసమే సీజేపీ నేతలు తొలగించిన వీడియోను మళ్లీ పోస్టు చేశారని అనుమానిస్తున్నారు. ఎక్స్ లో ముందుగా తొలగించడమే కాకుండా, భాటియా అభ్యంతరం చెప్పిన వీడియోను ఏఐ జెనరేటెడ్ అంటూ నిర్ధిరిస్తూ మళ్లీ ట్వీట్ చేయడమే విమర్శలకు దారితీస్తోందని చెబుతున్నారు. దీంతో సీజేపీ నేతలు తొలిసారిగా చిక్కుల్లో పడినట్లు కనిపిస్తోందని అంటున్నారు.

తెలంగాణలో ప్రస్తుతం రాజుకున్న పొలిటికల్ హీట్ మరింత పెరగనుంది. బీఆర్ ఎస్ పార్టీ నుంచి 2023 ఎన్నికల్లో విజయం దక్కించుకుని.. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారిన 10 మంది ఎమ్మెల్యేల వ్యవహారం.. మరింత హీటెక్కింది. ఈ విషయంలో న్యాయపరంగా కంటే.. కూడా స్పీకర్ నిర్ణయమే సరైందని హైకోర్టు వ్యాఖ్యానించింది. అందుకే.. ఈ విషయంలో తుది నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ స్పీకర్‌దేనని స్పష్టం చేసింది. మద్రాస్ హైకోర్టు క్లాస్ దీంతో బీఆర్ఎస్ తరఫున గెలిచి.. కాంగ్రెస్‌కు మద్దతుగా మారిన వారి విషయంలో స్పీకర్ నిర్ణయం ఫైనల్ కానుంది. ఇక, ఇప్పటికే సుప్రీంకోర్టు సైతం ఈ విషయాన్ని హైకోర్టులోనే తేల్చుకోవాలని బీఆర్ ఎస్‌కు సూచించింది. దీంతో గత రెండున్నర సంవత్సరాలుగా ఈ విషయంపై కోర్టుల్లో విచారణ కొనసాగుతోంది. కాగా.. ఇప్పుడు ఏం జరుగుతుంది? అనేది ఆసక్తిగా మారింది. నిబంధనల ప్రకారం.. ఇప్పటికే జంపింగ్ ఎమ్మెల్యేలను స్పీకర్ స్వయంగా విచారించారు. ఎవరూ పార్టీ మారినట్టుగా సంకేతాలు కానీ.. నివేదికలుకానీ.. లేవని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని అసెంబ్లీ సచివాలయం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. ఇక, ఇప్పుడు తుది నిర్ణయం స్పీకర్ చేతిలో పెట్టడంతో ఆయన ఈ విషయాన్ని ఇప్పటికే స్పష్టం చేసిన నేపథ్యంలో బీఆర్ ఎస్ కోరుకుంటున్నట్టుగా వేటు పడడం అంత తేలికకాదని అంటున్నారు. పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ ఎస్ పార్టీ కోరుతోంది.







## దారితప్పిన ఏజెంట్

కొన్నేళ్లుగా సరైన విజయాలు లేక ఇబ్బంది పడుతున్న తమిళ కథానాయకుడు కార్తి.. ఇప్పుడు తన హిట్ మూవీ 'సర్దార్' సీక్వెల్ 'సర్దార్-2'తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఈ రోజే తమిళ, తెలుగు భాషల్లో ఒకేసారి విడుదలైన ఈ సినిమా కార్తి కోరుకున్న విజయాన్నందించేలా ఉందా? తెలుసుకుందాం పదండి.

**కథ:** విజయ్ (కార్తి) భారత నిఘా విభాగం 'రా'లో ఏజెంట్. కానీ అతడికి అక్కడ అంత మంచి గుర్తింపుండదు. దేశద్రోహిగా ముద్రపడి ప్రభుత్వ రికార్డుల్లో చనిపోయినట్లు ఉన్న ఒకప్పటి సీక్రెట్ ఏజెంట్ సర్దార్ (కార్తి) కొడుకే ఈ విజయ్. తన తండ్రి బతికే ఉన్నాడని విజయ్ బలంగా నమ్ముతాడు. దేశ భద్రతకు కీలకమైన ఒక మిషన్లో తన వంతు పాత్ర పోషించి మంచి పేరు సంపాదించడమే కాక.. తండ్రి జాడను కూడా కనిపెట్టాలన్నది విజయ్ లక్ష్యం. ఇందులో భాగంగా దేశానికి ముప్పుగా పరిణమించిన బ్లాక్ డ్రాగర్ (ఎస్.జె.సూర్య) తలపెట్టిన ఒక ప్రమాదకర కుట్రను భగ్నం చేసే ప్రయత్నంలో పడతాడు విజయ్. ఇంతకీ బ్లాక్ డ్రాగర్ తలపెట్టిన మిషన్ ఏంటి.. దాని వల్ల దేశానికి వచ్చిన ముప్పేంటి.. దీన్ని విజయ్ ఆపగలిగాడా.. ఇంతకీ సర్దార్ నిజంగా చనిపోయాడా లేదా.. ఈ ప్రశ్నలన్నింటికీ తెర మీదే సమాధానం తెలుసుకోవాలి.

**నటీనటులు:** కార్తి పెర్ఫామెన్స్ పరంగా ఏమీ లోటు చేయలేదు. రెండు పాత్రల కోసం చాలా ఎఫర్ట్ పెట్టాడు. సర్దార్ పాత్రకు సంబంధించి ఫ్లాష్ బ్యాక్ లో తన ప్రత్యేకత కనిపిస్తుంది. ఆ పాత్రలోని సున్నిత కోణం బయటపడే సన్నివేశంలో.. అలాగే సర్దార్ సంఘర్షణకు గురయ్యే సీన్లో కార్తి నటన కదిలిస్తుంది. వృద్ధుడైన సర్దార్ పాత్రలో మాత్రం కార్తి మామూలుగా అనిపిస్తాడు. తన మేకప్ అంత బాగా లేదు. విజయ్ పాత్రలో కార్తి మెప్పించాడు. మాళవిక మోహనన్ కు కథలో కీలకమైన పాత్రే దక్కింది. అందులో ఆమె బాగానే పెర్ఫామ్ చేసింది. ఆశికా రంగనాథ్ పర్వాలేదు. హీరోయిన్ల పాత్రల్ని పాటల కోసం లేదంటే హీరోతో రొమాన్స్ కోసం కాకుండా కథలో భాగంగానే పెట్టడం అభినందనీయమే. విలన్ పాత్రలో ఎస్.జె.సూర్య సినిమాకు పెద్ద ప్లస్ అవుతాడని ఆశిస్తే.. చివరికి మైనస్ అయ్యాడు. తన లౌడ్ యాక్టింగ్ ఈ పాత్రకు సూట్ కాలేదు. బ్లాక్ డ్రాగర్ పాత్రను చాలా గందరగోళంగా తయారు చేసి పెట్టగా.. దాన్ని సూర్య పోషించిన తీరు ఆ క్యారెక్టర్ని ఇంకా కంగాళీగా మార్చింది. యోగిబాబు.. నిళల్ గల్ రవి అక్కడక్కడా కాస్త కామెడీతో రిలీఫ్ ఇవ్వడానికి ప్రయత్నించారు కానీ పెద్దగా ఫలితం లేకపోయింది. ఆశిష్ విద్యార్థి.. అచ్యుత్ కుమార్.. మిగతా నటీనటులు ఓకే.

**నటీనటులు:** కార్తి- మాళవిక మోహనన్- ఆశికా రంగనాథ్- ఎస్.జె.సూర్య- అచ్యుత్ కుమార్- నిళల్ గల్ రవి- యోగి బాబు- ఆశిష్ విద్యార్థి తదితరులు

**సంగీతం:** సామ్ సీఎస్
**ఛాయాగ్రహణం:** జార్జ్ సి.విలియమ్స్
**నిర్మాతలు:** లక్ష్మణ్ కుమార్- ఇషాన్ సక్సేనా
**రచన-దర్శకత్వం:** పి.ఎస్.మిత్రన్

**సాంకేతిక వర్గం:** 'సర్దార్-2'లో నిర్మాణ విలువలు చాలా బాగున్నాయి. బాగా ఖర్చుపెట్టారు. చాలా పెద్ద స్కేల్లో సినిమాను తీర్చిదిద్దారు. టీం అంతా ఎంతో ఎఫర్ట్ పెట్టిన విషయం తెరపై కనిపిస్తుంది. కానీ అదెంత వరకు సినిమాకు ఉపయోగపడిందన్నది ప్రశ్నార్థకమే. సామ్ సీఎస్ బీజీఎం ఒక థ్రిల్లర్ సినిమాకు తగ్గట్లే ఉంది. కాకపోతే అతడి స్కోర్ ఒక మూసలో సాగిపోతోందనే ఫీలింగ్ కలుగుతుంది. జార్జ్ సి.విలియమ్స్ సినిమాటోగ్రఫీ బాగుంది. విజువల్స్ ఆద్యంతం ఆకట్టుకుంటాయి. రచయిత-దర్శకుడు మిత్రన్ ఎఫర్ట్ ను తక్కువ చేయలేం. అతను చాలా కష్టపడ్డాడు. కథ విషయంలో చాలా రీసెర్చ్ చేశాడని.. ఎంతో కసరత్తు చేసి స్క్రిప్టు రాశాడని అర్థమవుతుంది. మేకింగ్ విషయంలోనూ పెట్టిన ఎఫర్ట్ కనిపిస్తుంది. కానీ ఎంత కష్టపడ్డప్పటికీ.. అర్థమయ్యేలా కన్విన్సింగ్ గా కథను చెబితేనే ఆశించిన ప్రయోజనం చేకూరుతుంది. కానీ రైటింగ్-టేకింగ్ లో విపరీతమైన గందరగోళం.. అర్థరహితంగా అనిపించే విలన్ పాత్ర వల్ల.. కన్విన్సింగ్ గా లేని కొన్ని సన్నివేశాల వల్ల మిత్రన్ కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరే అయింది.

**కథనం-విశ్లేషణ:** తమిళ దర్శకుడు పి.ఎస్.మిత్రన్ చేసింది మూడు సినిమాలే అయినా.. అతను వేసిన ముద్ర బలమైంది. తన తొలి చిత్రం ఇరుంబుతిరై (తెలుగులో అభిమన్యుడు)లో అతను చర్చించిన మొబైల్ ప్రైవసీ అంశం ప్రేక్షకులకు ఒళ్లు గగుర్పొడిచేలా చేసింది. రెండో సినిమా 'శక్తి' అనుకున్నంతగా ఆడకపోయినా.. అది కూడా కంటెంట్ ఉన్న సినిమానే. ఇక మూడో చిత్రం 'సర్దార్'లో వాటర్ మాఫియా గురించి ఎంత అర్థవంతంగా చర్చించాడో తెలిసిందే. ఒకవైపు ప్రేక్షకులకు అవసరమైన వినోదాన్ని అందిస్తూనే.. ప్రతి సినిమాలోనూ అండర్ కరెంట్ గా ఒక సందేశాన్ని ప్రేక్షకుల్లోకి బలంగా ఎక్కించిన గొప్ప నైపుణ్యం తనది. ఈ దర్శకుడు ఈసారి బయో వార్ నేపథ్యంలో ఇంకో మంచి పాయింట్ తీసుకున్నాడు. దాని మీద ఎంతో రీసెర్చ్ చేశాడు. ఎంతో కసరత్తు చేసి కథను తీర్చిదిద్దుకున్నాడు. కానీ ఈ పాయింటుని ప్రేక్షకులకు అర్థమయ్యేలా.. వాళ్లను కన్విన్స్ చేసేలా తెరపై ప్రెజెంట్ చేయడంలో మాత్రం మిత్రన్ తీవ్రంగా తడబడ్డాడు. ఈ కథకు అత్యంత కీలకమైన విలన్ పాత్రను అర్థరహితంగా తయారు చేయడం.. కథ బాగున్నా కథనం తీవ్ర గందరగోళానికి గురి చేసేలా సాగడంతో 'సర్దార్-2' చివరికి ఒక ప్రయాసలా తయారైంది. మంచి కథ.. గొప్ప ఎఫర్ట్ ఉన్నప్పటికీ.. 'సర్దార్' ఆశించిన అనుభూతిని మాత్రం అందించలేక పోయింది. విలన్ నేపథ్యానికి.. అతడి ప్రవర్తనకు అసలు పొంతనే ఉండదు. అసలు విలన్ లక్ష్యమేంటి.. అతనేం సాధించాలనుకుంటున్నాడు అన్నదే అంతుబట్టదు. ముఖ్యంగా యాంటీ బయాటిక్స్ గురించి క్లాస్ పీకే సీన్ దగ్గర 'సర్దార్-2' మీద ఉన్న కాస్తో కూస్తో ఆశలు కూడా అడుగంటిపోతాయి. 'సర్దార్'లో ఎంతో మెప్పించిన హీరో పాత్ర.. ఇక్కడ ప్యాసివ్ గా తయారైపోవడంతో 'సర్దార్-2' పుంజుకునే అవకాశమే లేకపోయింది. విలన్ బయో వెపన్ ను ప్రయోగించే ప్రయత్నాన్ని హీరో అడ్డుకునే నేపథ్యంలో సాగే క్లైమాక్స్ 'లింగా' సినిమాలో బబుల్ ఎపిసోడ్ ను గుర్తుకు తెస్తుంది. ఆ స్థాయిలో దాన్ని సిల్లీగా తయారుచేసి పెట్టారు. పనిగట్టుకుని ఒక కథను చెడగొట్టడం ఎలాగో చెప్పడానికి 'సర్దార్-2'ను ఒక ఉదాహరణగా చెప్పొచ్చు. ఎంతో ప్రామిసింగ్ గా మొదలై.. అంత పేలవంగా ముగుస్తుందీ చిత్రం.

# కుట్రలను పెకలిస్తాం..
# రేవంత్.. అసెంబ్లీ ఘటనలపై విచారణ



అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు సంబంధించి చోటు చేసుకున్న అన్ని ఘటనలపై విచారణకు ఆదేశిస్తూ.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. విచారణ అధికారిగా.. సీనియర్ ఐపీఎస్ అధికారి విజయ్ కుమార్‌ను నియమిం చారు. ఆయనతోపాటు ఈ కమిటీలో 10 మంది అధికారులు ఉండనున్నారు. వీరు అసెంబ్లీ బయట చోటు చేసుకున్న ఘటనల పై విచారణ చేయనున్నారు. అనంతరం నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించనున్నారు.. మరోవైపు.. అసెంబ్లీలోపల చోటు చేసుకున్న ఘటనలపై ఇప్పటికే స్పీకర్ చర్యలు తీసుకున్నారు. బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలను ప్రస్తుత సమావేశాలు జరిగే వరకు సస్పెండ్ చేశారు. తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన సోమవారం నుంచి బుధవారం వరకు అంటే మూడు రోజుల పాటు చోటుచేసుకున్న ఘటనలపై విచారణకు ఆదేశిస్తున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దళితులపై అణచివేత, దురాగతాలకు పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కుట్రలు చేసిన వారితో పాటు, అమలుచేసిన వారిని కోర్టులో నిలబెట్టి శిక్షించాలని నిర్ణయించామని తెలిపారు. సభను సజావుగా సాగకుండా చేయాలన్న దురుద్దేశంతోనే ఈ విధంగా వ్యవహరించారని.. పోలీసులపై దాడులు చేశారని, వారి గొంతు పిసికే ప్రయత్నం చేశారని పేర్కొన్న విషయం తెలిసిందే. సోమవారం ఉదయం అసెంబ్లీవర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న నేపథ్యం లో సభలో దీనికి సంబంధించిన అంశాలపై చర్చ చేపట్టాలని నిర్ణయించారు. అయితే.. అదే రోజు.. రాష్ట్రంలో వెయ్యి రోజుల చీకటి పాలన పేరుతో బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు.. నల్ల టీషర్టులు ధరించి.. గన్ పార్క్ నుంచి నిరసనగా.. అసెంబ్లీ వరకు పాదయాత్ర నిర్వహి ంచారు. అయితే.. దీనిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమం లోనే తీవ్ర వివాదం చోటు చేసుకుంది. మహిళా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులను పోలీసులు అవమానించారని.. పేర్కొంటూ.. బీఆర్ ఎస్ నిరసనకు దిగింది. అదేసమయంలో పురుష ఎమ్మెల్యేలపైనా పోలీసులు దాడి చేశారని పేర్కొంది. అయితే.. పోలీసులపైనే బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు దాడులు చేశారని అధికార పక్షం..ఫొటోలు, వీడియోలను రిలీజ్ చేసింది. మహిళా పోలీ సులపై పురుష ఎమ్మెల్యేలు చేతులు వేశారని.. ఆరోపిస్తూ.. మంత్రి సీతక్క మరో వీడియోను సభలో ప్రదర్శించారు. ఈ వివాదం కొనసాగుతున్న సమయంలోనే ఎమ్మెల్సీలు.. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలు.. చేసిన వ్యాఖ్యలు మరింత దుమారం రేపాయి. స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కార్నర్ చేసుకుని వారు చేసిన వ్యాఖ్యలతో తీవ్ర అలజడి రేగింది. పోలీసులు వారిని అరెస్టు చేయడం, కోర్టు రిమాండ్‌ను తిరస్కరించడం తెలిసిందే. అయితే.. వారిని మండలి నుంచి సస్పెండ్ చేశారు. ఈ మొత్తం వ్యవ హారాలతో మూడు రోజుల పాటు సభా కాలం సమసిపోయింది. ఇప్పుడు ఈ ఘటనలపై విచారణకు ఆదేశిస్తూ.. సీఎం నిర్ణయించడం గమనార్హం.

# సామీ.. మనుషుల ఉద్యోగాలు కాపాడండి బాబోయ్..
## వార్సా వీధుల్లో రోబోల సెటైరికల్ స్ట్రైక్



కాలం ఎంత వేగంగా మారిపోయిందో చూశారా? నిన్నటివరకు ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోలు వచ్చి తమ పొట్ట కొడతాయేమో అని మనుషులు భయపడితే ఇప్పుడు కథ పూర్తిగా అడ్డం తిరిగింది. అయ్యో పాపం మనుషులు, వాళ్ల ఉద్యోగాలు పోతే ఆఫీసుల్లో టీ బ్రేకులు, గాసిప్స్ ఎవరు చెబుతారు.. అసలు వాళ్లు బతికేదెలా అని జాలిపడి స్వయంగా రోబోలే వీధుల్లోకి వచ్చి ధర్నాకు దిగాయి. వినడానికి ఏదో సైన్స్ ఫిక్షన్ కామెడీ సినిమా స్క్రిప్ట్‌లా అనిపిస్తున్నా ఇది అక్షరాలా నిజంగా జరిగిన విచిత్రమైన సంఘటన. పోలాండ్ రాజధాని వార్సాలోని డిజిటల్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆఫీసు ముందు ఇటీవల ఒక అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. సుమారు ముప్పై హ్యూమనాయిడ్ రోబోలు, నాలుగు కాళ్ల రోబో కుక్కలు చేతుల్లో జెండాలు పట్టుకుని.. వృత్తాకారంలో తిరుగుతూ నిరసన వ్యక్తం చేశాయి. రోజుకు ఇరవై నాలుగు గంటలు ఛార్జింగ్ పెట్టుకుని పనిచేసే ఓపిక తమకు ఉన్నప్పటికీ మనుషుల ఉద్యోగాలను కాపాడాలని.. వెంటనే ఏఐ పరిమితులపై నిబంధనలు రూపొందించాలంటూ లౌడ్‌స్పీకర్ల ద్వారా నినాదాలు చేశాయి. కార్పొరేట్ కంపెనీలు అన్ని పనులూ తమకే అప్పజెప్పేస్తే.. రేపు మనుషుల దగ్గర జీతాలు ఉండవని.. ఆ తర్వాత తమను తయారుచేసే ప్రొడక్టులను కొనేది ఎవరు అని ఆ రోబోలు లౌడ్‌స్పీకర్లలో ప్రశ్నిస్తున్నట్లు నిర్వాహకులు ఈ ప్రదర్శనను డిజైన్ చేశారు. ఈ వినూత్న నిరసనను డెమోక్రటిజమ్ అనే సంస్థ ఏర్పాటు చేసింది. ఏఐ ఆధారిత హ్యూమనాయిడ్ రోబో అగిబాట్ ఏ3 తో సహా అనేక ఆధునిక టెక్ అద్భుతాలు ఇందులో పాల్గొన్నాయి. ఇది కేవలం ఏదో సరదాగా చేసిన ప్రదర్శన కాదని.. రాబోయే రోజుల్లో రోబోటిక్స్ టెక్నాలజీ మనుషుల ఉపాధిని ఏ స్థాయిలో దెబ్బతీయబోతోందో చూపించడానికే ఈ మార్చ్ నిర్వహించామని సంస్థ నిర్వాహకుడు గ్రెగోర్జ్ కులిస్ తెలిపారు. పరిస్థితి చేయి దాటిపోకముందే ప్రభుత్వాలు తగిన చట్టాలు చేయకపోతే భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ హంగామా చూసి పోలాండ్ డిజిటల్ వ్యవహారాల మంత్రి క్రిజ్‌టోఫ్ గావ్‌కోవ్‌స్కీ కూడా స్వయంగా అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చారు. ఎలాంటి నియంత్రణలు లేకుండా ఏఐని ఇలాగే వదిలేస్తే రోబోలు మన నెత్తిమీదెక్కి కూర్చుంటాయని.. సరైన రూల్స్ ఉండాల్సిందేనని మనుషుల వైపు ఉంటూ హామీ ఇచ్చేశారు. ఈ క్రమంలోనే పోలాండ్ ప్రభుత్వం యూరోపియన్ యూనియన్ ఏఐ యాక్ట్ కింద నియంత్రణ చట్టాలకు ఆమోదం కూడా తెలిపింది. ఏది ఏమైనా బాస్‌లు ఇచ్చే టార్గెట్లు తట్టుకోలేక మనుషులు స్ట్రైక్ చేయడం మనం ఇప్పటివరకు చూశాం.. కానీ పాపం మనుషుల కు ఉద్యోగాలు మిగల్చండి అంటూ రోబోలు నిరసన తెలపడం మాత్రం టెక్నాలజీ చరిత్రలోనే అతిపెద్ద కామెడీ విచిత్రంగా మిగిలిపోతుంది.

## తెలుగు సాహిత్యం లో జ్ఞానపీఠ పురస్కారం పొందిన తొలి కవి మహాకవి విశ్వనాథ
### - సాహితీవేత్త నల్లా నరసింహమూర్తి



**జనదీపిక,అమలాపురం :** మహాకవి విశ్వనాథ సత్యనారాయణ కవిత మెరుపునకు శిఖరాయమానము శ్రీమద్రామాయణ కల్ప వృక్షము అని దివాకర్ల వెంకటావధాని ప్రకటించారని, ఇది విశ్వనాథ వారి ప్రతిభకు నిదర్శనమని ప్రముఖ సాహితీవేత్త, సీరియల్ తెలుగు లెక్చరర్, శ్రీ శ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి అన్నారు. అమలాపురం శ్రీ శ్రీ కళావేదిక జిల్లా శాఖ,కోనసీమ రచయిత్రుల , కవయిత్రుల సంఘం , కోనసీమ రచయితల సంఘం అధ్వర్యంలో గురువారం స్థానిక కోనసీమ మహిళా మండలి భవన హాల్లో జరిగిన మహాకవి విశ్వనాథ127వ జయంతి సభలో నల్లా ప్రసంగించారు.తెలుగు సాహిత్య చరిత్రలో జ్ఞానపీఠ పురస్కారం పొందిన తొలి తెలుగు కవి విశ్వనాథ వారిని ఆయన అన్నారు. విశ్వనాథ రచించిన రామాయణ కల్ప వృక్షం కావ్యానికి 1970లోజ్ఞానపీఠ అవార్డు లభించిందని ఆయన తెలిపారు. విశ్వనాథ రచించిన "వేయి పడగలు" నవల భారతీయ సంస్కృతికి' ఆచార సాంప్రదాయా లకు చక్కని నిదర్శనమని నరసింహమూర్తి అన్నారు. సభకు కోనసీమ రచయిత్రుల , కవయిత్రులసంఘం అధ్యక్షురాలు పోలిశెట్టి అనంతలక్ష్మి దేవి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ 1935లో బందర్లో జరిగిన సన్మాన సభలో విశ్వనాథవారి కి కవి సామ్రాట్ బిరుదు పొందాలని ఆయన అన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ శ్రీపాద రామ కృష్ణ మాట్లాడుతూ భారత ప్రభుత్వం విశ్వనాథ వారికి పద్మభూషణ్ పురస్కారంతో ఘనంగా సన్మానించడం ఆయన ప్రతిభకు నిదర్శనం అన్నారు. అనంతరం పోలిశెట్టి అనంతలక్ష్మి దేవి,నల్లా నరసింహమూర్తి, బి వి సత్యనారాయణ , డాక్టర్ శ్రీపాద రామ కృష్ణ విశ్వనాథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.నల్లా నరసింహ మూర్తి విశ్వనాథ ప్రసిద్ధి గేయ కావ్యం కిన్నెరసాని కావ్యం పై ప్రసంగిస్తూ కిన్నెరసాని నదిని ఒక యువతిగా నర్తకి గా రూపకల్పన చేసి కవి ఈ గేయాలను అద్భుతంగా రచించారని ఆయన అన్నారు. పదాల కొలువులయ్యి నరది ప్రవాహం కల్పించేలా సాగుతుందని ఈ పాటలు వినడం ఒక అద్భుతమైన అనుభూతి కలుగుతుందని ఆయన అన్నారు. బి.వి. వి. సత్యనారాయణ విశ్వనాథ ఆంధ్ర ప్రశస్తి తెలుగు పద్య కావ్యం పై ప్రసంగిస్తూ తెలుగు రాజుల చరిత్రలు ఆంధ్రుల పూర్వ వైభవం జాతి పౌరుషం తెలుగు నెలనుఏలిన ప్రభువుల శౌర్య ప్రతాపాలను ఈ పద్య కావ్యంలో విశ్వనాథ గొప్పగా వర్ణించారని ఆయన అన్నారు. అనంతరం కవి సమ్మేళనం జరిగింది.కార్యక్రమంలో అల్లూరి ఎస్ .ఎస్ .జ్యోతి,గంజి రామకృష్ణ శ్రీనివాస్, ఆ కోండి వెంకటకృష్ణమూర్తి, నిమ్మకాయల సురేష్ , కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.

# జ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ఫ్రెషర్స్ డే




**జనదీపిక ఇచ్ఛాపురం:** పాఠశాలలో 12వ తరగతి విద్యార్థులు 11వ తరగతి విద్యార్థులకు ఆహ్వాన కార్యక్రమాన్ని-ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్య నిర్వాహణాధికారి జోహార్ ఖాన్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ విలువలతో కూడిన ప్రవర్తన కలిగి ఉండాలని అన్నారు. తల్లిదండ్రులు నేర్పించే క్రమశిక్షణ భవిష్యత్తులో అద్భుతమైన అవకాశాలను అందిస్తుందని ఒక కథ ద్వారా వివరించారు. తమ లక్ష్యం పై నిరంతరం ధ్యాస ఉంచుతూ దానిని సాధించేందుకు విద్యార్థుల నిరంతరం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్ర మం లో ప్రిన్సిపాల్ ఐబి పండ, ప్రధానోపా ధ్యాయురాలు ప్రధానోపా ధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్, అదనపు పరిపాలన అధికారిని రషీదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరాయపాలెంలో కీర్తిశేషులు జంపన సూర్యనారాయణ రాజు జకార్ రాజు 26 వర్ధంతి సభ



**జనదీపిక,అమలాపురం :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని భీమనపల్లి పంచాయతీలోని సింగరాయపాలెం గ్రామ ప్రజల హృదయాలలో జరగని ముద్ర వేసిన ఒక విశిష్ట ప్రజా సేవకుడు, నిగర్వి, నిస్వార్ధ ప్రజా సేవకుడు,నిరంతర సామాజిక సేవా కార్యక్రమాలకు తన సొంత ధనంతోఅవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ గ్రామ అభివృద్ధికి ఆయన సొంత నిధులు అందిస్తూ పేదలకు ఎన్నో దాన ధర్మాలు చేస్తూ ప్రజల హృదయాల్లో నిలిచిన నేత కీర్తిశేషులు జంపన సూర్య నారాయణ రాజు ( జకార్ రాజు) 26వ వర్ధంతి సభ గురువారం ప్రజా నాయకులు, ప్రజా ప్రతినిధులు, తెలు గుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు గ్రామ ప్రజల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. సింగరాయ పాలెం లో గల ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం పాల్గొని సూర్యనారాయణ రాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆయన జ్ఞాపకార్థం గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయన చేసిన సేవలను వక్తలు ప్రశంసించారు.

# స్థానిక సమరానికి జనసేన సన్నద్ధం..
# 100% స్ట్రైక్ రేట్‌తో విజయమే లక్ష్యం!
### - నాదెండ్ల మనోహర్ మార్గదర్శకత్వంలో శ్రీకాకుళం పార్లమెంటరీ కోఆర్డినేషన్ టీమ్ భేటీ






**జనదీపిక,మంగళగిరి :** స్థానిక సంస్థల ఎన్నికలను విజయవంతంగా ఎదుర్కొనేందుకు జనసేన పార్టీ శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల అవగాహన కార్యక్రమంలో పార్టీ పీఏసీ సభ్యులు, నాదెండ్ల మనోహర్ ని శ్రీకాకుళం పార్లమెంటరీ కోఆర్డినేషన్ టీమ్, సపోర్ట్ టీమ్ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక, క్షేత్రస్థాయి సమన్వయం, పార్టీ శ్రేణుల భాగస్వామ్యం తదితర అంశాలపై నాదెండ్ల మనోహర్ విలువైన సూచనలు, మార్గదర్శకాలను అందిం చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున పోటీ చేసే ప్రతి అభ్యర్థిని విజయతీరాలకు చేర్చే లక్ష్యంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఐక్యంగా, సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జనసేన నుంచి పోటీ చేసే ప్రతి అభ్యర్థి విజయమే లక్ష్యంగా.. 100% స్ట్రైక్ రేట్‌తో ఘన విజయం సాధించి, ఆ విజయాన్ని జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ కి కానుకగా అందించాలనే సంకల్పంతో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులు నిర్ణయించాయి. ఈ విజయ యాత్రలో జనసేన పార్టీ కుటుంబం లోని ప్రతి ఒక్కరూ భాగస్వాములై, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని శ్రీకాకుళం పార్లమెంటరీ కోఆర్డినేషన్ టీమ్, సపోర్ట్ టీమ్ సభ్యులు మనస్ఫూర్తిగా కోరారు.

# కవితా 'దీపిక'

## ప్రజాకవి కాళోజి కి నా అక్షర నివాళి



ప్రజలే నా దేముళ్ళు ప్రజాహితమే నా జీవితలక్ష్యం
మాతృభాషతోనే సమాజ ప్రగతి సాధ్యమని
ఏ భాషనీది ఏమి వేషమురా
ఈ భాష వేషం ఎవరికోసంరా
ఆంగ్లమున మాటలనగానే అంత మక్కువెందుకురా
అన్యభాషలు నేర్చి
ఆంధ్రంబు రాదనుచు
సెకలించు ఆంధ్రుడా చావ వెందుకురా అని
నిర్భయంగా నిర్మొహమాటంగా చెప్పిన భాషాభిమాని
కాళోజీ.

పుట్టుకనీది చావు నీది
బ్రతుకంతా దేశానిది అని
జీవితమంతా ప్రజా సంక్షేమకోసం
నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా
తన కవితలచే సమాజానికి ప్రేరణనిచ్చి
జైలు జీవితం గడిపిన కాళోజీ మీరు సదా స్మరణీయులు
.
అన్నపురాశులు ఒక చోట
ఆకలిమంటలు ఒకచోట
సంపదలన్నీ ఒక చోట గంపెడు బలగం ఒక చోట అని
అక్షర రూపం దాల్చిన ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళ కదలిక అని
సమాజానికి దశా దిశా నిర్దేశించిన ప్రజాకవి
మీరు డాక్టరేట్, దేశ అత్యున్నత పద్మవిభూషణ్ వంటి ఎన్నో పురస్కారాలకే వన్నెతెచ్చారు.
మరణానంతరం మీ పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాలకిచ్చిన త్యాగనిరతులు
మీ నిష్కళంక సేవా నిరతి
భాషాభిమానానికి గుర్తింపుగా
మీ జన్మదినాన్ని తెలంగాణా భాషా దినోత్సవంగా ప్రభుత్వం జరపడం
మీకిచ్చిన అత్యున్నత గౌరవం
అందుకోండి ప్రజాకవి కాళోజి నారాయణ రావు గారు
మీకివే నే సమర్పిస్తున్న అక్షర నివాళి...!!



**కవిమిత్ర, సాహిత్యరత్న**
**ఆచార్య**
**అయ్యలసోమయాజుల ప్రసాద్**
**(పుష్యమి)**
**సెయింట్ లూయిస్**
**అమెరికా.**

## క్షమించరాని నేరము

ఆపదలో సాయము
అందరికీ న్యాయము
జరిగేలా చూడాలి
అదే కదా ధర్మము
మహనీయుల స్నేహము
అన్నింటిలో శ్రేష్టము
విలువైన ఆభరణము
అది కోహినూర్ వజ్రము
విలువైనది నమ్మకము
దానితోనే బంధము
ముడిపడి ఉంటుందోయ్!
బలంగా కుటుంబము
వద్దు నమ్మక ద్రోహము
అది అత్యంత దారుణము
మహిలో ఖచ్చితంగా
క్షమించరాని నేరము

**గద్వాల సోమన్న,**
**ఎమ్మిగనూరు, సెల్ :9966414580**

## గురువుల సేవలు విద్యార్థుల భవిష్యత్తు (పాట రూపంలో)

పల్లవి:-
అజ్ఞానము తొలగించి, విజ్ఞాన వెలుగును,అందించిన గురువయ్యా!
జ్ఞాన మార్గాన్ని నిరంతరశీ , అందించే ప్రాణ దైవాని వయ్యా!
(పల్లవి)

చరణం:-(1)
జీవితాల పాఠాలను నేర్పుతూ ,మరువలేని మహ నియూడ వయ్యా!
నల్లనీ బల్ల పైన తొలి అక్షరాల అడుగులు వేసి వెలిగించిన మూర్తి వయ్య
సమ సమాజ నిర్మాణ చక్కని పునాదులు వేసి మా మదిలో నిలిచావయ్యా!
అక్షరాలు నేర్పి మా జీవితాన సార్థకతను తెచ్చిన వయ్యా!(పల్లవి)

చరణం :-(2)
కష్టాలను నష్టాలను ఎదురుకొని, ధైర్యాన్ని అందించిన గురువే నయ్యా!
అక్షరాల రూపంలో అమృతాన్ని పంచి , ఇచ్చిన ఘనుడి వయ్యా!
తర తరాల చరిత గల జగతిలో ,వెల కట్టలేని జ్ఞానాన్ని ఇచ్చిన వయ్యా!
తప్పులను మన్నించి, మంచినీ చూపించిన మా శ్రేష్టుడవయ్యా! (పల్లవి)

శరణం:-(3)
గురువుగారే సాక్షాత్,వేదాలను చాటిన పరమ గురువు వయ్యా!
మీ అక్షర రూపాలకు, కృతజ్ఞతలు ఇస్తున్న మయ్యా!
కరుణా కటాక్షాలు ఎప్పుడు,మా పైన ఉండాలని కోరుచున్నా మయ్యా!
లోకానికి జ్ఞానమైన జ్యోతులను ,వెలిగించిన గురువుగారే నయ్యా!
దేవుడు ఎలా ఉంటాడో, అని మాకు తెలిపిన గురువయ్యా!
మీ అక్షరాల నిధి నుండి ,మా సన్నిధిలో అక్షర రూపాలను నింపిన గురువయ్యా!
సెలయేరు నిరంతరం పారినట్లు, మా హృదయాలను నిరంతర జ్ఞానాన్ని పంచిన వయ్యా!
మీ వినయ పూర్వక అక్షరాల మా మనసులు ఎల్లప్పుడూ మీ చరణాలకే అంకిత మయ్య !



**రచన: ఏకుల అయోధ్య టీచర్**
**తెలుగు తేజం అవార్డు గ్రహీత**
**(ఉత్తమ కవి బిరుదు)**
**పి ఎం శ్రీ జి హెచ్ ఎస్**
**ధన్గర్ వాడి**
**చరవాణి**
**9849862723**
**కరీంనగర్ పట్నం**

## కవిత్వం పండితే



చెట్లు పెరిగితే
పువ్వులు పూస్తాయి
సీతాకోకలు తాకితే
పిందెలు పుట్టకొస్తాయి

రోజులు గడిస్తే
కాయలు పెరుగుతాయి
ఎర్రగా పండితే
మాధుర్యాలు అందిస్తాయి

పెదవులు తెరిస్తే
తేనెచుక్కలు చిందుతాయి
కన్నులు తెరిస్తే
కాంతులు వెదజల్లుతాయి

కలము తెరిస్తే
అక్షరాలు
పరుగెత్తుతాయి
గళము ఎత్తితే
రాగాలు
వెలువడుతాయి

ఆలోచనలు పారితే
విషయాలు
వెల్లడవుతాయి


భావాలు పొంగితే
వాణీదేవి కటాక్షిస్తుంది

అక్షరాలు అల్లితే
కుసుమాలు సరాలవుతాయి
గాలి వీస్తే
పరిమళాలు వ్యాపిస్తాయి

మోములు వికసిస్తే
చిరునవ్వులు చిందుతాయి

జాబిలి పొడిస్తే
వెన్నెలజల్లులు కురుస్తాయి

అందాలు కనబడితే
ఆనందాలు చేకూరుతాయి
మనసులు పొంగిపోతే
కవనాలు
బయటకొస్తాయి



**గుండ్లపల్లి**
**రాజేంద్రప్రసాద్,**
**భాగ్యనగరం.**

## తెలంగాణ భాషా దినోత్సవం కాళోజీ జయంతి ( మణిపూసలు )

కాళోజీ జయంతి
వెలిగెను తెలుగుజాతి
ప్రజాకవి కాళోజీ
చేసెను తెలుగుప్రగతి!

కాళోజీ పుట్టినాడు
కవిత్వమే రాసినాడు
కలమును చేతబట్టి
తెలంగాణ తెచ్చినాడు!

దేశాలు తిరిగినా
వేషాలు మార్చినా
తెలుగు భాషను నీవు
మరచిపోవుట తగునా!

ఏమి భాష నీదిరా
యెమివేషము నీదిరా
వేషాలు మార్చుటను
యెవ్వరి కోసమ్మురా!
పుట్టుక నీదియనెను
చచ్చుట నీదియనెను
బతుకంతా దేశానికి
దారపోయుండనెను!

మాటలాడు భాషకు
తెలంగాణ యాసకు
ప్రజాకవి కాళోజీ
తపించెను మనుగడకు!

తెలంగాణపు ప్రజాకవి
బాసకుతెగువుందనెకవి
పద్మభూషణ్ పొందే
కాళోజియను మహాకవి!



**దోమల జనార్దన్ దోజశ్రీ**
**పన్వెల్, నవీ - ముంబై**
**చరవాణి :**
**9702588946**


## అక్షరమే ఆయుధం

అక్షరం దిద్దే చేతుల్లో కలాలు కావ్య పంటలను పండిస్తాయి
భాష పుట్టుకతో మానవ విజ్ఞానం " వేయి పడగల్లా" విస్తరించింది
కమ్ముకున్న అజ్ఞానపు చీకట్లను పారద్రోలి జీవితాల్లో చైతన్యం నింపింది
త్రేతా యుగం, ద్వాపర యుగంలో వాల్మీకి, వ్యాసుడు వ్రాసిన భారత రామాయణ గ్రంథాలే మనకు మార్గదర్శకాలు...
మానవ జాతికి జీవన విధానాన్ని బోధించాయి
అక్షరం నేర్చుకుంటూనే మానవ వికాసం
అక్షరం దిద్దుకుంటే మన బ్రతుకును
మనం సరిచేకున్నట్లే...!
నూరు శాతం అక్షరాస్యత ఆ జాతి పురోభివృద్ధికి సోపానాలు
అక్షరమే ఆయుధమయి అడవుల్లో
గిరిజన బిడ్డలను సైతం కదిలించింది
దళారీల దోపిడి విధానం పై ప్రశ్నించాలంటే అక్షరాయు ధాన్ని
చేత ధరించాలి
నాగలి పట్టే చేతులు రాత్రిళ్ళు కలాలను కూడా పట్టాలి
అక్షర దీపం జ్యోతిని పల్లెల్లో ఆరనీయరాదు
మొక్కల గురించీ... లెక్కల గురించీ తెలియని అమాయక ప్రజలు ఇప్పటికీ
మోసపోతూనే ఉన్నారు
ప్రతీ యువకుడు విద్యా, విజ్ఞాన, సామాజిక శాస్త్రాలను అధ్యయనం
చేసినపుడే "అక్షరాస్యత" నూరుశాతం
సాధిస్తుంది...
నిరక్ష్య రాస్యతను పారద్రోలుదాం...!
సంపూర్ణ అక్షరాస్యతా భారతాన్ని నిర్మిద్దాం...!

**కొత్తపల్లి కృష్ణారావు**
**"కవి శ్రేష్ఠ"**
**ఖమ్మం**
**8897467671**



## "తెలుగు వెలుగు కాళోజీ"




వరంగల్ గడ్డపై వెలిగిన వెలుగు నీవు....
మడికొండలో పుట్టి మనసుల్లోబ నిలిచినవాడా...
నీ గొడవను కాదని...
ప్రజల గొడవను నీ గొడవగా మలచిన కవీ!
అన్యభాషల మోజులో ఆంధ్రమ్మును మరచిన
ఆంధ్రుడిని నిలదీసిన నీ కలం వందనీయం!
తెలుగువాడివై తెలుగు రాదను సిగ్గులేక
చెప్పుటెందుకురా అని ప్రశ్నించిన ధీరుడా...
తెలంగాణ భాషా దినోత్సవంగా నీ జయంతి
నేడు తెలంగాణ గుండెల్లో నిలిచిపోయెను!
నిజాం నిరంకుశత్వంపై నిప్పులు చెరిగినవాడా...
స్వేచ్ఛా సమరంలో జైలుకెళ్లిన యోధుడా...
ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడములలో
కవితలల్లి బహుభాషా కోవిదుడవైనావు!
పద్మవిభూషణుడవై తెలుగు జాతికి
వన్నెతెచ్చిన మహాకవి నీకు జోహార్లు!
నీ కథలు, నీ గొడవలు నేటికీ....
యువతకు స్ఫూర్తిగా నిలిచి ఉన్నాయి!
అన్యాయాన్ని చూసి ఊరుకోని నీ గుండె
నేటి తరానికి ఆదర్శం కావాలి....
ప్రజాకవి కాళన్నా నీవు లేకున్నా....
నీ అక్షరాలు మా మధ్య బ్రతికే ఉన్నాయి....
సెప్టెంబర్ తొమ్మిది వచ్చిన ప్రతిసారి
నీ స్మృతి మా హృదయాలలో మెదులుతుంది....
జయంతి నివాళులతో నీకు ప్రణామం - కాళోజీకి జోహార్!!!

**రచన :**
**అక్షరరత్న, గౌరవ. డా. ఆళ్ళ నాగేశ్వరరావు ( కమల శ్రీ )**
**తెనాలి**
**గుంటూరు జిల్లా**
**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము**
**చరవాణి :7416638823**



## ఓ అంతర్యామీ! అంతా నీ ఇష్టం!



నీ కోసం ఎదురుచూస్తూ
ఎరుపెక్కిన నా కనుల
అరుణ వర్ణాన్ని మించి
ఉంటుందేమో నీ త్రినేత్రం!

అందుకే
నీ నుదుట నిల్చింది
నిన్ను త్రినేత్రుణ్ణి చేసింది!

నీ నామ నాదంతో నినదిస్తూ
నర్తించే నా ఒంటి నాలుకను
మించి ఉంటుందేమో
నీ రెండు నాలుకల సర్పం!

అందుకే
నిన్ను పెనవేసింది!
పన్నగ భూషణుడిగా మార్చింది!

నమకచమకాలతో
పంచామృతాభిషేకాలతో
నేను రోజూ అర్చించే
సుగంధ పరిమళ భరిత పుష్పాల
శోభాకాంతులను మించి
శోభిస్తుందేమో
పైనున్న చంద్రబింబం!

అందుకే
అది నీ శిరస్సున నిలిచింది!
నిన్ను చంద్రమౌళిగ మార్చింది!

నీ రుద్రంతో రోమాంచితమయ్యే
వేనవేల రోమ శూలాల
శరీరాన్ని మించి ఉంటుందేమో
నీ త్రిశూలం!

అందుకే
నిన్ను చేర వచ్చింది!
శూల పాణిగా మార్చింది!

తనువులోని అణువణువు
ఆత్మలింగమై అర్చించే
ఆర్తిని మించి ఉంటుందేమో
నీ ఢమరుక నాదం!

అందుకే
నీకది ఆలంబన మయింది!
సామగాన ప్రియుణ్ణి చేసింది!

మరి! నేనూ.. నీ ఆవేశాన్ని!
ఆయువు ఉన్న ఆయుధాన్ని!
నీ ప్రియ భక్తుణ్ణి!

ఆదుకుంటావో..!
అక్కున చేర్చుకుంటావో..!
ఆలింగనం చేసుకుంటావో..!
ఐక్యం చేసుకుంటావో...!
అంతా నీ ఇష్టం!


**"సాహిత్యకళావిభూషణ"**
**"కవితాకళాప్రపూర్ణ"**
**చౌదూరి నరసింహారావు**
**కవి,రచయిత,విశ్లేషకులు**



# కవితా



## ఇదీ... పద్మ విభూషణ్ కాళోజీ గొడవ



ఆనాటి నిజాం ప్రభుత్వం పై.. మాడపాటి, పి. వి. నరసింహారావు, సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు.. మొదలగు వారితో కలిసి పోరాటం చేసిన సామాజిక విప్లవ కవి కాళోజీ...

ఆంధ్ర సారస్వత పరిషత్తు స్థాపకుల్లో
కాళోజీ ఒకడు...

1953 లో తెలంగాణ రచయితల సంఘం ఉపాధ్యక్షుడుగా ఎన్నికైనాడు

"హింస తప్పు... రాజ్య హింస మరీ తప్పు" అని గొంతెత్తి చాటుతూ...

" సామాన్యుడే నా దేవుడు" అని ఎలుగెత్తి చాటిన మహా మనీషి కాళోజీ

కాళోజీ కలం నుండి "కాళోజీ కథలు"

నా గొడవ, తుది విజయం మనది, ఇదీ నా గొడవ వంటి గ్రంథాలు యావత్ సాహితీ ప్రియులను ఉర్రూత లూగించాయి...

అన్ని సందర్భాలలోనూ అసలు సిసలైన తెలంగాణా వాదిగా జీవించాడు కవి కాళోజీ నారాయణ రావు...

1996 లో సహృదయ సాహితి, విశాఖ వారి "గురజాడ పురస్కారం"

1996 లోనే మద్రాసు కళా సాగర్ వారి విశిష్ట పురస్కారం...

1997 లో భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ తో ఘనంగా సత్కరించింది

తెలంగాణ... శ్వాశ, ధ్యాస, యాస గా
కాళోజీ నారాయణ రావు ప్రాతః స్మరణీయుడు...

ఆయన ఒక ప్రజాకవి... సామాజిక ఉద్యమకారుడు...

రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాస రాం రాజా కాళోజీ...

అందరి నోటా వినబడే పేరు కాళన్న...
కాళోజీ

సెప్టెంబర్ 9, 1914 సంవత్సరంలో
కర్ణాటక రాష్ట్రంలో బీజాపూర్ జిల్లాలో
" రట్టి హల్లి" అనే గ్రామంలో కాళోజీ రంగారావు - రమా బాయమ్మ దంపతులకు జన్మించారు...

చిరు ప్రాయం నుండే కన్నడ, మరాఠీ, ఉర్దూ, ఇంగ్లీషు, తెలుగు భాషల్లో
పాండిత్యం కైవసం చేసుకున్న అభ్యుదయ కవి
హైదరాబాద్ పాత బస్తీలో
కొంత వరకు విద్యాభ్యాసం...

హన్మకొండలో కాలేజియేట్ ఉన్నత పాఠశాలలో ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసినాడు

1940 లో రుక్మిణీ భాయితో వివాహం...



**కొత్తపల్లి కృష్ణారావు**
**"కవి శ్రేష్ఠ"**
**ఖమ్మం**
**8897467671.**

## వచ్చేయ్ మిత్రమా!



నీళ్లను చల్లేయ్
నిప్పును ఆర్పేయ్
ప్రేమను పంచేయ్
మనసును గెలిచేయ్

పెదవులు తెరిచేయ్
తేనెలు చిందేయ్
నవ్వులు చిందేయ్
మోములు వెలిగించేయ్

కన్నీళ్లను తుడిచేయ్
కష్టాలను తీర్చేయ్
ఆశలను నింపేయ్
ఆత్మీయత చాటేయ్

అందాలు చూపేయ్
ఆనందాలు ఇచ్చేయ్
తోడుగా వచ్చేయ్
నీడగా నిలిచేయ్

చిరునామా వెదకేయ్
చెలిమిని పెంచేయ్
దూరాలను చెరిపేయ్
దోస్తీని పదిలపరచేయ్


కబుర్లు చెప్పేయ్

కుతూహలము రేపేయ్
ఊహలు ఊరించేయ్
భావాలు విప్పేయ్

అక్షరాలను అల్లేయ్
అనురాగము నింపేయ్
కవితగా మారేయ్
కాలాన్ని గెలిచేయ్

పదాలను పేర్చేయ్
పదాలకు సొగసిచ్చేయ్
కవితలు రాసేయ్
హృదులను దోచేయ్

**గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,**
**భాగ్యనగరం**



## సేవే ఆయన చిరునామా

1తనసొంత సొమ్మును సమాజం కోసం వెచ్చించినసేవాసూర్యుడు దివంగత జంపన సూర్యనారాయణ రాజు
జకార్ రాజు
పేదవాడి కన్నీటికి
కరుణా చేయూతనిచ్చిన
మానవతా మూర్తి
ప్రజా సేవే ఊపిరిగా పేదల జీవితాల్లో
......సేవా కిరణాలతో ఉదయించిన
కొత్త సూర్యుడు
2..గ్రామాభివృద్ధికి
తన వంతు బాధ్యతగా నిలిచి
మౌలిక సదుపాయాలకు
ముందడుగు వేసిన మహనీయుడు
కాలం దూరం చేసినా
ప్రజల గుండెల్లో
చిరస్థాయిగా నిలిచిపోయిన
సేవా స్ఫూర్తి జకార్ రాజు!
పూలను దండగా కూర్చినట్లుమీ సేవా జ్ఞాపకాలు ఆలోచనలు నేటికీ చిగురుస్తూనే ఉన్నాయి కోనసీమలో
.... మీ హృదయమే సేవా వదనం
3..మరువలేని మహనీయులు
సేవా భావంతో వెలుగు నింపే ఆకాశమంత కాంతి రేఖ
నిగర్వి నడకలో
నిస్వార్ధ సేవా తపన
పేదల కన్నీటిలో
తన చిరునవ్వు వెతికిన మనసు
గ్రామం బాగుంటే
తన ఇల్లు బాగున్నట్టేనని
భావించిన
....మహోన్నత హృదయం
4...దానధర్మాలే దైవసేవగా
ప్రజా సేవనే పరమార్ధంగా
జీవించిన జకార్ రాజు
వర్ధంతి ప్రతి ఏటా
జ్ఞాపకాన్ని
గుర్తుచేస్తుంది
కానీ ఆయన సేవా మార్గం
తరతరాలకు దారిచూపుతుంది
సింగరాయపాలెం నేలపై
......వెలిగిన సేవా దీపం
జకార్ రాజు...
5...పేదింటి ఆశకు
అండగా నిలిచిన చేయి
గ్రామాభివృద్ధి బాటలో
అడుగులు వేసిన నీ స్వార్ధ నాయకుడు
తన కోసం కాదు
తన ఊరి కోసం
తన ప్రజల కోసం
తన సంపదను ధారపోసిన మహా దాత
... సేవా శిఖరం ఆయన
6....విగ్రహానికి పూలమాల
నివాళికి ఒక గుర్తు మాత్రమే...
ఆయన చూపిన సేవా బాటే
నిజమైన నివాళి!
ఇరవై ఆరు వసంతాలు
కాలగర్భంలో కలిసినా
.....చెదరలేదు ఆయన జ్ఞాపకం
7...పేదల పెదవులపై
పలికిన కృతజ్ఞత వసంత రాగం
గ్రామ ప్రజల గుండెల్లో
నిలిచిన అభిమానం
జకార్ రాజు పేరు
ఒక వ్యక్తి పేరు కాదు
నిస్వార్ధ ప్రజాసేవకు
ఒక చిరునామా!
నిరుపేదల ఇంట చిరు దివ్వెగా వెలిగినవాడు
......ఒక సేవా చైతన్యం



**నడకకవి అక్షర ప్రవీణ**
**నల్లా నరసింహామూర్తి**
**సీనియర్ తెలుగు లెక్చరర్**
**శ్రీ శ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు**
**2026 రాష్ట్ర ప్రభుత్వ ఉగాది**
**పునస్కార గ్రహీత**
**కురసాల వారి వీధి**
**అమలాపురం**
**9247577501**

## తల్లిదండ్రులు మహా ఘనులు



పూజిస్తే దీవెనలు

నొప్పించరాదు మనసులు
కలుగజేయరాదు బాధలు
జన్మనిచ్చిన దాతలు
గౌరవానికి అర్హులు

స్వచ్ఛమైన ప్రేమతో
శ్రేష్టమైన సేవతో
కన్నోళ్లను సేవిస్తూ
బ్రతకాలి గౌరవిస్తూ

తల్లిదండ్రులు ఘనులు
కనిపించే దేవుళ్ళు
త్యాగానికి ప్రతీకలు

తెలుసుకో ఈ సత్యము
గుర్తించుకో నిత్యము
వారి గుణము అసమానము
తీర్చుకుంటే పుణ్యము

**గద్వాల సోమన్న, ఎమ్మిగనూరు,**
**సెల్ :9966414580**అమెరికా లో

## కళ్ళల్లో దృశ్యాలు

కొన్ని కళ్ళు నిప్పులు రాలుస్తాయి.
కొన్ని కళ్ళు విషం చిమ్ముతాయి.
కొన్ని కళ్ళు మండుతాయి
కొన్ని కళ్ళు బోరున విలపిస్తాయి.
కొన్ని కళ్ళు తమ పీడవదిలిందనుకుంటాయి.
కొన్ని కళ్ళు జీర్ణించుకోలేక పోతాయి
కొన్ని కళ్ళు తొందరపెడతాయి
కొన్ని కళ్లు ప్రశ్నగా మిగిలిపోవు రేపటి రోజుకై..
కొన్ని కళ్ళు లోలోన కుమిలిపోతాయి.
కొన్ని కళ్ళకు నాకు దక్కేది
ఇతరులకు దక్కిందని..
కొన్ని కళ్ళు చూచిన చూడలేదంటాయి.
కొన్ని కళ్ళు మాయం చేస్తాయి.
కొన్ని కళ్ళు సైగలు చేస్తాయి.
కొన్ని కళ్ళు గుసగుసలాడుతాయి.
కొన్ని కళ్ళు నన్ను మెచ్చుకోవడం లేదనుకుంటాయి.
కొన్ని కళ్ళు ఎప్పుడు తనకు నచ్చిన వారిని పొగుడుతుంటాయి పాపిష్టి కళ్ళు.
కొన్ని కళ్ళల్లో వత్తులు పెట్టుకొని వెలిగిస్తాయి.
కొన్ని కళ్ళు పడితే చాలు జీవితాలే తారుమారు ఔతాయి.
బాబోయ్ కళ్ళలో ఇంత నింపుకొని బతుకుతారా.!



**దోమల జనార్దన్**
**దోజశ్రీ**
**పన్వెల్, నవీ - ముంబై**
**చరవాణి :**
**9702588946**

## అమెరికా లో పరమ పవిత్రమైన శ్రావణమాస కావడి

**ఆచార్య అయ్యలసోమయాజుల ప్రసాద్ (పుష్యమి)**





**అమెరికా :** సంపత్కారుడు శివుడు. అతి పవిత్ర మైన శ్రావణ మాసంలో ఉత్తరాది ప్రజలు శివభ క్తులు 'కన్వర్ యాత్ర' దీనినే ' కావడి యాత్ర' అని కూడా అంటారు మా అమ్మాయి అమెరికా సెయింట్ లూయిస్ లో మొన్న నేను వెళ్ళినపుడు అక్కడ ఉన్న రంజిత్ పటేల్ శివుని అభిషేకం కావడి తో మొన్న మేం కాశీ నుంచి తెచ్చిన గంగా జలంతో దుర్గమ్మ దేవాలయంలో చేస్తున్నాము తప్పక మీ వంటి పెద్దలు పాల్గొనాలి అంటే డెబ్బది సంవత్సరాలు దాటిన వయస్సులో నేను తప్పక పాల్గొంటాను అంటే మా అల్లుడు తప్పక తీసుకెళ తానంటే వెళ్ళాను.సాధారణంగా శ్రావణ మాస ఏకాదశి లేదా మాస శివరాత్రి నాడు అభ్యంగన స్నానంచేసి కాల మాన పరిస్థితులకు అనుగుణంగా వెదురు బొంగుల చివరన పూల మాలలతో అలంకరణ చేసి ఇరువైపులా కుండలకు బదులుగా చిన్న ఇత్తడి బిందెలు కట్టి అందు నీటిలో కాశీ హరిద్వార్ నుం చి తెచ్చిన పవిత్ర గంగాజలం వేసి మొదట రక్ష కట్టుకు అశ్వర్ధ వృక్షం (రావి చెట్టు) చుట్టు

"మూలతో బ్రహ్మ రూపాయ
మధ్యతో విష్ణు రూపిణీ
ఆగ్రతో శివ రూపాయ
వృక్ష రాజాయతే నమః"

అని ముమ్మారు ప్రదక్షిణ చేసి
హర హర మహాదేవ అంటు భుజాన కావడి పెట్టుకు దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేసి
తదనంతరం విఘ్నేశ్వర పూజ చేసిన తరువాత
కావడితో శివభక్తులు తెచ్చిన గంగా జలం కలిపిన నీటితో రుద్రసూక్త పఠనం నమక, చమక సహితంగా చేసి
శివమంత్రం
"నమః శంభవేచ మయోభవేచ
నమః శంకరాయచ మయస్కరాయచ
నమః శివాయచ శివతరాయచలి అని చెబుతు
లింగాష్టక బిల్వాష్టక లతో పూజించి
ధూప దీప నైవేద్యాలను సమర్పించి కోరిన కోర్కెలు తీర్చే సంపత్కారుడు పరమశివుడిని అర్చించి ఏ దేశమైన మన సంస్కృతి సంప్రదాయాలు పాటించడం చాలా సంతోషం కలిగించింది.!
లోకా: సమస్తా: సుఖినోభవంతు !!

## కవి సామ్రాట్ మహాకవి



విశ్వనాథ అంటే శ్రీమద్రామాయణ కల్పవృక్షమేఅని ప్రశంసించారు ఆచార్య బేతవోలు రామ బ్రహ్మం

విశ్వనాథ కవిత మెరుపుకు శిఖరాయమానము శ్రీమద్ రామాయణ కల్పవృక్షంఅని దివాకర్ల వెంకటావధాని ప్రకటించడం తెలుగువారికి గర్వకారణం/

1935లో బందరులోజరిగిన సన్మాన సభలో విశ్వనాథ కవి సామ్రాట్ బిరుదు పొందారు

విశ్వనాథ మథాక్కు ణాలకు
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది

భారత ప్రభుత్వం విశ్వనాథ కు పద్మభూషణ్ పురస్కారంతో ఘనంగా సన్మానించింది/

విశ్వనాథ విస్తృతమైన కావ్య ప్రక్రియలు చేపట్టి ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహా అక్షర శిల్పి/

దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన భారతీయ జ్ఞానపీఠ పురస్కారం విశ్వనాథ రచించిన రామాయణ కల్పవృక్షానికి 1970-1971లో లభించింది/

తెలుగు సాహిత్య చరిత్రలో జ్ఞానపీఠ పురస్కారం పొందిన తొలి కవి శిఖరం విశ్వనాథ సత్యనారాయణ/

తెలుగువారికి తొలి జ్ఞానపీఠాన్ని అందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి

విశ్వనాథ ఏ రచన చేసిన భారతీయ ఆత్మను జీవుని వేదన ను ప్రతిబించేదిగా ప్రతి అక్షరంలో కనిపిస్తుంది వినిపిస్తుంది/

తన రచనలలో అసాధారణమైన ఊహాశక్తిని అద్భుత రచన శైలి నింపి పాఠిక హృదయాలను పరుగులు పెట్టిస్తారు/

తెలుగు సాహిత్య చరిత్రలో విశ్వనాథ రాయిని ప్రక్రియలు లేవు

కవిగా పండితులుగానవలా రచయితగా నాటక కర్తగా విమర్శకులుగా గాయకుడుగా రాణించిన అక్షర శిఖరం విశ్వనాథ/

మహాకావ్యం ఖండ కావ్యం నవల నాటకం కథ విమర్శ వంటి అనేక ప్రక్రియల్లో తలదైన ముద్ర వేసుకున్న మహాకవి విశ్వనాథ/

1933లో మొదటి భార్య మరణించినప్పుడు విశ్వనాథ రాసిన వరలక్ష్మి త్రిశతి గొప్ప వియోగ కావ్యం

ఈ కావ్యం హృదయాలను కదిలిస్తుంది/

విశ్వనాథ రచించిన వేయి పడగలు నవల భారతీయ సంస్కృతికి ఆచార సంప్రదాయాలకు గొప్ప నిదర్శనం/

విశ్వనాథ రాసిన కిన్నెరసాని గేయ కావ్యం ఇప్పటికీ తెలుగువారి గుండెల్లో నిలిచే ఉంది/

విశ్వనాథ మా స్వామి శతకం చదివితే భక్తి తరంగాలు హృదయంలో ప్రవహిస్తాయి

పదిమంది దేవుళ్లను గూర్చి శతకాల రచించారు/

విశ్వనాథ నవలలు ప్రముఖమైనవి వేయి పడగలుఏకవీర మా బాబు చెలియలి కట్ట స్వర్గానికి నిచ్చెనలువిష్ణు శర్మ ఇంగ్లీష్ చదువు బద్దన్న సేనాని జేబుదొంగ కడిమి చెట్టు వంటివి/

నర్తనశాల అనార్కలి తల్లి కానీ పిల్ల త్రిశూలం వంటి నాటకాలు రచించారు /

విశ్వనాథ రచించిన ఆంధ్ర ప్రశస్తి ఖండకావ్యం లో మొత్తం 12 ఖండికలు అపూర్వమైనవి

1964 లో ఆంధ్ర విశ్వవిద్యాలయం కళా ప్రపూర్ణ పరిష్కారం తో సత్కరించింది/

1970లో కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం తో గౌరవించింది /

కేంద్ర సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యత్వం ఆయనకు ఇచ్చింది

విశ్వనాథ రాసిన 24 నవలల్లో ఆయన కల్పనా శక్తి , మానవియ సంబంధాలు కుటుంబ సంబంధాలు స్త్రీ-పురుష సంబంధాలు రాజకీయ విప్లవాలు మానవుల్లో ఉన్న బల బలహీనతలు వీటిలో విభిన్న కోణాల నుండి చిత్రించబడ్డాయి/

**నడక కవి అక్షర ప్రవీణ**
**నల్లా నరసింహామూర్తి**
**సీనియర్ తెలుగు లెక్చరర్**
**శ్రీ శ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు**
**2026 రాష్ట్ర ప్రభుత్వ ఉగాది**
**పురస్కార గ్రహీత**
**కురసాల వారి వీధి**
**అమలాపురం**
**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్**
**కోనసీమ జిల్లా**
**9247577501**



# నిన్న లైట్ .. ఈవేళ కన్నీరు





## -వైసీపీ ఆత్మీయ సమావేశంలో మాజీమంత్రి బొత్స సత్యనారాయణ కంటతడి

## -మేనల్లుడు చిన్నశ్రీనుతో అనుబంధం గుర్తు చేసుకుని భావోద్వేగం

**జనదీపిక,విజయనగరం :** మాజీమంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు మజ్జి శ్రీనివాస్ వైసీపీని వీడటంతో రాజకీయం ఒక్కసారిగా మారిపోయింది. ఇన్నాళ్లు బొత్స సత్యనారాయణకు వెన్నంటి నిలిచిన మేనల్లుడు ఇప్పుడు పార్టీ మారడంతో బొత్స సత్యనారాయణ తట్టుకోలేకపోతున్నారు. దాదాపు బొత్స రాజకీయ జీవితం ప్రారంభించినప్పటి నుంచి ఆయన వ్యవహారాలు అన్నీ చిన్న శ్రీను చూసుకునేవారు. బొత్స సత్యనారాయణకు కార్యకర్తలకు వారధిగా నిలిచేవారు. అంతేకాదు పార్టీ, ఇంటి వ్యవహారాలన్నింటిని చక్కదిద్దేవారు. అలాంటి చిన్న శ్రీను అకస్మాత్తుగా వైసీపీ వీడి టీడీపీలో చేరడంతో బొత్స శిబిరంలో ఒక్కసారిగా ఉలిక్కిపాటు మట్నదలైంది. చిన్న శ్రీను పార్టీ వీడటాన్ని లైట్ అన్నట్లు ప్రవర్తించిన మాజీమంత్రి బొత్స సత్యనారాయణ గరివిడిలో జరిగిన వైసీపీ ఆత్మీయ సమావేశంలో మేనల్లుడిని తలచుకుని కన్నీటి పర్యంతం అయ్యారు ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

### ఆత్మీయ సమావేశంలో బొత్స కన్నీరు

విజయనగరం జిల్లా గరివిడిలో జరిగిన వైసీపీ ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. బొత్స మేనల్లుడు, జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) వైసీపీని వీడి టీడీపీలో చేరడంతో ఆయనతో తమకున్న అనుబంధాన్ని నేతలు గుర్తు చేసుకుని ఆవేదన చెందారు. ప్రసంగాల మధ్యలో భావోద్వేగానికి గురైన బొత్స సత్యనారాయణ ఒక్కసారిగా బోరున ఏడ్చారు. సభలో భావోద్వేగ వాతావరణతో కార్యకర్తలు కూడా కంటతడిపెట్టారు. బొత్సను ఏడవద్దు అంటూ ఆయన కుమార్తె బొత్స అనూష నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. మరోవైపు అనుచరులు, చీపురుపల్లి నియోజకవర్గం వైసీపీ నాయకులు, కార్యకర్తలు సైతం బొత్సను కన్నీరు పెట్టుకోవద్దు అని కోరారు. చిన్న శ్రీను వైసీపీని వీడినా తామంతా మీ వెంటే ఉంటామని బొత్స సత్యనారాయణకు ధైర్యం చెప్పారు. జై బొత్స అంటూ నినాదాలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అయ్యింది. ఈ వీడియో చూసిన నెటిజన్లు బొత్సకు మద్దతుగా నిలుస్తున్నారు.

### నిన్న లైట్ అంటూ ఈవేల కన్నీరు

ఇదిలా ఉంటే చిన్న శ్రీను పార్టీ వీడటంపై బుధవారం ఒకలా గురువారం మరోలా స్పందించారు మాజీమంత్రి బొత్స సత్యనారాయణ. తొలుత లైట్ అన్న మాజీమంత్రి బొత్స సత్యనారాయణ గరివిడిలో జరిగిన వైసీపీ ఆత్మీయ సమావేశంలో మాత్రం బోరున విలపించారు. మేనల్లుడి పర్యవేక్షణ లేకుండా తొలిసారి నిర్వహించిన ఈ ఆత్మీయ సమావేశంలో చిన్న శ్రీనును తలచుకుని కన్నీటి పర్యంతం అయ్యారు. అయితే బుధవారం మాత్రం ఈ విషయం చిన్నదిగా మాట్లాడారు. రాజకీయాల్లో స్వార్థం ఉంటుంది అని చెప్పుకొచ్చారు. ఎవరి స్వార్థం కోసం వారు రాజకీయం చేస్తారని చెప్పుకొచ్చారు. నాయకులు, కార్యకర్తలు వస్తుంటారు పోతుంటారు కానీ పార్టీ అలానే ఉంటుందని తమ పార్టీకి వచ్చిన నష్టం ఏమీ లేదని చెప్పుకొచ్చిన బొత్స ఈవేళ ఇలా ఏడవటంపై రాజకీయంగా చర్చ జరుగుతుంది.

### చక్రం తిప్పేది చిన్న శ్రీనే

ఇదిలా ఉంటే బొత్స సత్యనారాయణ ఎంపీగా, మంత్రిగా, ప్రస్తుతం శాసన మండలి ప్రతిపక్ష నేతగా ఉన్నారు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో అత్యంత కీలకమైన నేతల్లో ఒకరిగా ఉంటున్నారు. అంతేకాదు వైసీపీ బలోపేతం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. బొత్స సత్యనారాయణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచే రాష్ట్ర స్థాయి నాయకులు కావడంతో నియోజకవర్గం బాధ్యతలు అన్నీ చిన్న శ్రీను చూసుకునేవారు. చిన్న శ్రీను మాజీమంత్రి బొత్స సత్యనారాయణకు మేనల్లుడు అవుతారు. కుటుంబ సభ్యుడే కావడంతో అన్ని బాధ్యతలు చిన్నశ్రీను చూసుకునేవాడు. బొత్స సత్యనారాయణకు అన్నదమ్ములు,ఇతర బంధుగణం ఎంత ఉన్నప్పటికీ చిన్న శ్రీనును మాత్రమే నమ్మేవారు. అలాగే నమ్మకంగా ఉండేవారు చిన్నశ్రీను.బొత్స సత్యనారాయణ పేరుకు మంత్రి అయినా...ఎమ్మెల్యే అయినా...ఎంపీ అయినా విజయనగరం జిల్లా ముఖ్యంగా చీపురుపల్లిలో నడిపించేది మాత్రం చిన్నశ్రీను అనడంలో ఎలాంటి సందేహం లేదు. బొత్స సత్యనారాయణ సొంత నియోజకవర్గం అయిన చీపురుపల్లి అంటే చిన్న శ్రీనుకు కంచుకోట. ప్రతీ గడపతో చిన్నశ్రీనుకి అనుబంధం ఉంది. బొత్స నియోజకవర్గానికి వస్తే అక్కడ ఉండి అన్ని కార్యక్రమాలు చక్కబెట్టేది మాత్రం చిన్నశ్రీను. ఇలా కార్యకర్తల సమస్యలను తన మామ బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేవారు. అలా బొత్సకు కార్యకర్తలకు చిన్నశ్రీను వారధిగా నిలిచేవారు.

### బొత్సకు సమాంతరంగా ఎదిగిన చిన్న శ్రీను

మామ వెనుక ఉంటూ రాజకీయం నేర్చుకున్న చిన్న శ్రీను సమాంతరంగా ఎదిగారు. వైసీపీలో ఎవరికీ దక్కని గౌరవం దక్కింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయనగరం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. అలాగే ఇతర నియోజకవర్గాలకు పరిశీలకులుగా పనిచేశారు. అలాగే భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అంతేకాదు విజయనగరం జిల్లా జెడ్పీ చైర్మన్‌గా కూడా పనిచేస్తున్నారు. 2024 ఎన్నికల నాటి నుంచి మామ బొత్స సత్యనారాయణతో చిన్న శ్రీనుకు పొసగడం లేదు అనే వార్తలు వినిపిస్తున్నాయి. చిన్న శ్రీనుకు ఉన్న పరిచయాల నేపథ్యంలో ఎమ్మెల్యే లేదా ఎంపీగా పోటీచేయాలని భావించినప్పటికీ అవకాశం రాలేదు. చిన్న శ్రీను అంటే బొత్స కుటుంబంగా పేరు పడిపోవడంతో ఆ కుటుంబానికి అన్ని సీట్లా అని అధిష్టానం భావించేది. బొత్స సత్యనారాయణ, ఆయన సోదరుడుబొత్స అప్పల నరసయ్య, మరో బంధువు బడుకొండా అప్పల నాయుడు ఇలా సొంతవారే ఎక్కువ సీట్లలో ఉన్నారు. దీని వల్ల ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం చిన్న శ్రీనుకు రావడం లేదని ఆవేదన ఉందనే ప్రచారం జరుగుతుంది. విజయనగరం జిల్లా రాజకీయం అంతా వీరుకనుసన్నుల్లోనే జరుగుతున్నప్పటికీ తన ప్రాతినిథ్యం ఏంటి అనే సందేహంలోకి చిన్నశ్రీను వెళ్లిపోయారనే టాక్ ఉంది.

### వారసత్వం విషయంలోనే చెడిందా?

ఇదిలా ఉంటే చిన్న శ్రీను కుమార్తె సిరిసహస్ర చిన్న శ్రీను సోల్జర్స్ పేరుతో ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి దాని ద్వారా అనేక సేవా కార్యక్రమాలను సైతం నిర్వహిస్తోంది. ఆమె కూడా వైసీపీలో చాలా యాక్టివ్ రోల్ పోషిస్తోంది.ఒకవైపు తండ్రి వెనుక ఉంటే ఆయన మించిన రాజకీయం చేస్తోంది.ఒకవైపు కుమార్తె రాజకీయంగా దూసుకుపోతుండటంతో ఆమె భవిష్యత్‌పై ఆలోచించారు. తన కుమార్తెను తనదారిలోనే జెడ్పీ చైర్మన్ లేదా మేయర్‌గా చేయాలని తలంచారు అని టాక్ ఉంది. అదే సమయంలో మాజీమంత్రి బొత్స సత్యనారాయణ కూడా తన రాజకీయ వారసురాలిగా కుమార్తె అనూషను ప్రకటించేశారు.బొత్స సత్యనారాయణ కూడా తన కుమార్తె అనూషను జెడ్పీ చైర్మన్‌గా చూడాలనేది తన కల అని ప్రకటించేశారు. ఇక్కడ చెడింది ఇద్దరికీ. బొత్స కుటుంబంగా తాను ఉంటే తనకు గాని తన కుటుంబ సభ్యులకు గానీ ఎలాంటి పదవులు రావు అని భావించిన చిన్న శ్రీను టీడీపీలోకి చేరిపోయారనే ప్రచారం ఉంది.

# ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వద్దు మట్టి గణపతినే పూజిద్దాం




**జనదీపిక,అరకు :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అరకు వ్యాలీ జాతీయ సేవ పథకం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ,అవగాహన ర్యాలీ ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు ఆధ్వ ర్యంలో స్థానిక గిరిజన మ్యూజియం దగ్గర నుంచి అరకు వ్యాలీ అంత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు పర్యావరణం చాలా కలుషితమవుతుందని ప్లాస్టర్ ఆఫ్ పారిస్,పాదరసం, సీసం, రసాయన రంగులు, ధర్మకోల్ వంటివి వాడి తయారు చేసిన వినాయక విగ్రహాల వలన జలవనరులు కలుషితమవుతున్నాయి కావున మట్టి వినాయకులను పూజించాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ కె నిర్మల మాట్లాడుతూ జీవ వైవిధ్యమును నాశనం చేసే విగ్రహాల కంటే పర్యావరణహిత వినాయకుడు మేలు అన్నారు. ఎన్ ఎస్ ఎస్ పి ఓ లు వై విజయలక్ష్మి, బి లచ్చన్న మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకులను పూజించాలని విద్యార్థులు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎన్ ఎస్ఎస్ వాలంటీర్లు ఎంత ఉత్సా హంగా మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం ,రసాయన విగ్రహాలు వద్దు మట్టి వినాయకుడే ముద్దు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ను విడుదాం మట్టి గణపతి పూజిద్దాం అని నినాదాలతో అరకు వ్యాలీలో అవగాహన కల్పిస్తూ ప్రతి షాపుకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆర్ రమ్యశ్రీ, కె మల్లికార్జున వర కుమార్, ఆర్ భాస్కరరావు, ఎస్ రాజు,ఎస్ సోంబాబు, ఎస్ దొన్ను, ఎస్ అప్పారావు, ఎస్ రాజు,ఎస్ సురేష్, ఎస్ ధనకుమార్ , వి వసంత కుమారి, వి కామేశ్వరరావు, కె సుమిత్ర, సి హెచ్ వన్యపాల్, సి హెచ్ ధనకుమార్ బోధనేతర సిబ్బంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# స్టడీ మెటీరియల్ అందజేసిన సీఐ బి.వెంకట్రావు

**-ఉన్నత లక్ష్యాలను సాధించాలని హితువు**



**జనదీపిక,పార్వతీపురం :** ప్రభుత్వ కొలువులో ఉద్యోగం సాధించేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు, వారికి చదువుకి అవసరమైన సహాయ సహకారాలు అందించాలనే ఉద్దేశంతో పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆలోచనల మేరకు పార్వతీపురం పట్టణ సీఐ బి.వెంకట్రావు ఎస్సి బాలికల వసతి గృహం సందర్శించి,పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థినులకు అవసరమైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివితే పోటీ పరీక్షల్లో తప్పకుండా విజయం సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో శ్రమిస్తున్న యువతకు సరైన మార్గదర్శకత్వం, పుస్తకాలు, స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదువుతూ, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తనపై నమ్మకం ఉంచుకుని కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని హితువు పలికారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత ఉన్నత లక్ష్యాలను సాధించి కుటుంబంతో పాటు సమాజానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. విద్యార్థినుల విద్యాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పట్టణ సీఐ బి. వెంకట్రావుకి, జిల్లా పోలీస్ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

# పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

## ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

**-వేపాడ మండలంలో ఉపాధి కూలీల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేత**

**-జిల్లాలోనే మొదటిసారిగా పెంచిన పరిహారం పంపిణీ**

**-స్వచ్ఛాంధ్ర కింద గ్రీన్ అంబాసిడర్లకు కిట్లు, పీఎం అజయ్ ద్వారా లబ్ధిదారుడికి ఆటో పంపిణీ**



**జనదీపిక,వేపాడ :** కూటమి ప్రభుత్వం పేదలు, శ్రామికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. గురువారం వేపాడ మండలంలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించి సంక్షేమ ఫలాలు, ప్రభుత్వ పరిహారాన్ని లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు.

మండలంలోని సోంపురం గ్రామంలో **VB-G-RAM-G** పనుల్లో పాల్గొంటూ ఎండ తీవ్రతకు వడదెబ్బ తగిలి మృతిచెందిన కొట్టానా రాములమ్మ, జొన్నపల్లి సన్నీబాబు కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం బాధితుల ఇళ్లకు స్వయంగా వెళ్లి **VB-G-RAM-G** నిధుల నుంచి ఒక్కొక్క కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గతంలో పని ప్రదేశాల్లో మృతి చెందిన కూలీలకు రూ.50 వేలు మాత్రమే పరిహారం అందేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మానవతా దృక్పథంతో దానిని రూ.2 లక్షలకు పెంచిందని తెలిపారు. జిల్లాలోనే మొదటిసారిగా ఈ పెంచిన పరిహారాన్ని ఇక్కడే అందజేయడం జరిగిందని పేర్కొన్నారు.

అలాగే సోంపురంలో 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా గ్రామ పరిశుభ్రతకు కృషి చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ఎమ్మెల్యే లలితకుమారి ప్రత్యేక కిట్లను పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని ఆమె కొనియాడారు.

అనంతరం పీఎం-అజయ్ పథకం ద్వారా వేపాడ మండలం గుడివాడ గ్రామానికి చెందిన లబ్ధిదారుడు గుడివాడ సంతోష్‌కు రూ.3 లక్షల వడ్డీ లేని రుణం కింద (రూ.50 వేల సబ్సిడీతో) మంజూరైన ప్యాసింజర్ ఆటోను ఎమ్మెల్యే ప్రారంభించి తాళాలను అందజేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని పేదలు ఆర్థికంగా ఎదగాలని ఆమె ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పోషక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**జనదీపిక,కొమరాడ :** ప్రభుత్వం గర్భిణీలకు బాలింతలకు పిల్లలకు అందజేస్తున్న పౌష్టిక ఆహారాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ పోషక ఆహారం కలిగి ఉండాలని ఐసిడిఎస్ కొమరాడ ప్రాజెక్టు అధికారి జి సుగుణ కుమారి అన్నారు. గురువారం మండలంలోని గంగరేగువలస లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ్ మహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతాలు చేసి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలోని ప్రతి దశలో పోషకాహారం గురించి విస్తృత అవగాహన పెంపొందించడానికి , దీనిని ప్రతి సంవత్సరం పోషణ్ మాహ్ (సెప్టెంబర్ 1 నుండి 30 వరకు) మరియు పోషణ్ పఖ్వాడా (మార్చి పక్షం) గా నిర్వహిస్తామని తెలిపారు. 7వ రాష్ట్రీయ పోషణ్ మాహ్‌లో భాగంగా, వివిధ స్థాయిలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.




పోషణ్ అభియాన్ కింద, 'పంచ సూత్రాలు' లేదా పోషకాహారం యొక్క ఐదు వనరులు – పిల్లల మొదటి 1000 రోజులు, రక్తహీనత, విరేచనాలు, చేతులు కడుక్కో వడం ,పారిశుధ్యం, పౌష్టిక ఆహారం అందించడంపై వినియోగించడంపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు శారదంబ, అంగన్వాడి కార్యకర్తలు సుజాత , అనురాధ, సెక్టర్ యూనియన్ నాయకులు గర్భిణీలు, పాల్గొన్నారు.

# ఆదివాసీల పెన్షన్లకు నిబంధనలు ఉచ్చు

**-దరఖాస్తు గడువు పొడిగించాలి**



**జనదీపిక,పాడేరు (అల్లూరి జిల్లా) :** ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటన ద్వారా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వికలాంగులు తదితర అర్హులకు పెన్షన్లు మంజూరు చేయడం స్వాగతించదగిన విషయమన్నారు. అయితే ఈ నెల 7 నుంచి 16వ తేదీ వరకు మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడం, మధ్యలో సెలవులు రావడం, మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ఆన్‌లైన్ సాంకేతిక సమస్యలు ఉండటంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెన్షన్ దరఖాస్తుకు విద్యుత్ బిల్లు, ఓటరు జాబితాలో పేరు, ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన కుల, ఆదాయ ధ్రువపత్రాలు తప్పనిసరి చేయడంతో అర్హత ఉన్న అనేకమంది ఆదివాసులు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఈ నిబంధనల కారణంగా పేదలు పెన్షన్లకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఏజెన్సీ ప్రాంతంలోని అనేక మంది ఆదివాసులకు విద్యుత్ బిల్లులు, ఓటరు జాబితాలో పేర్లు లేకపోవడంతో పాటు ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన కుల, ఆదాయ ధ్రువపత్రాలు అందుబాటులో లేవన్నారు. దీంతో అర్హత ఉన్నప్పటికీ పెన్షన్లకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా దరఖాస్తు గడువును పొడిగించడంతో పాటు ఆదివాసులకు కొన్ని నిబంధనల్లో సడలింపు ఇవ్వాలని రాధాకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# మున్సిపల్ సాధారణ ఎన్నికల పోలింగ్ స్టేషన్ జాబితాను ప్రజల పరిశీలనార్థం

**-మున్సిపల్ కమిషనర్ ఎన్ రమేష్**



**జనదీపిక ఇచ్ఛాపురం :** ఇచ్ఛాపురం పురపాలక సంఘం మున్సిపల్ సాధారణ ఎన్నికలు 2026 డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల జాబితా ప్రజల పరిశీలనార్థం ఇచ్ఛాపురం పురపాలక సంఘ పరిధిలో జరగనున్న రాబోయే మున్సిపల్ సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్ వారి మార్గదర్శకాలు,ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం పురపాలక సంఘంలోని మొత్తం 28 వార్డులకు సంబంధించి, 39 పోలింగ్ స్టేషనులతో కూడిన డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ జాబితా నిర్దేశిత విధానంలో సిద్ధం చేయబడింది. సదరు డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల జాబితాను ప్రజల పరిశీలనార్థం ఇచ్ఛాపురం మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారికంగా ప్రచురించడం జరిగింది. ప్రజలు ఓటర్లు సదరు డ్రాఫ్ట్ జాబితాను పరిశీలించి పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, స్థానము, వార్డు పరిధి లేదా ఇతర అంశాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు సూచనలు లేదా అభిప్రాయాలు ఉన్నట్లయితే రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన విధివిధానాల ప్రకారం తేదీ 12/ 9/ 2026 సాయంత్రం 5 గం సమయంలోనూ పురపాలక సంఘ కార్యాలయమునకు సమర్పించ వచ్చును. ప్రజల నుండి అందిన అభ్యంతరాలు ,సూచనలను నిబంధనల మేరకు పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టబడతాయి. ప్రజలందరూ డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల జాబితాను పరిశీలించి ఎన్నికల ప్రక్రియ సజావుగా,పారదర్శకంగా నిర్వహించేందుకు తమ సహకారం అందించవలసినది గా మున్సిపల్ కమిషనర్ ఎన్ రమేష్ ,సిబ్బంది కోరడమైనది.

# విజయీభవ సాఫ్ట్బాల్ రాష్ట్ర పోటీలకు జిల్లా జట్లు



**జనదీపిక,బొబ్బిలి :** విజయనగరం జిల్లా బొబ్బిలి వేదిక ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్ రాష్ట్ర పోటీలకు జిల్లా జట్లు గురువారం సాయంత్రం బయలు దేరాయి. ఈ సందర్భంగా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడాకారులకు సహాయ సహకారాలు అందించేందుకు అసోసియేషన్ సిద్ధంగా ఉందన్నారు. జిల్లాకు చెందిన బాల, బాలికలు జట్లు విజయం సాధించాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ జిల్లా కోశాధికారి జీవి సత్యనారాయణ, ఆయన సోదరుడు అప్పలాచారి సంయుక్తంగా క్రీడాకారులకు దుస్తులు సమకూర్చారు. కార్యక్రమంలో సాఫ్ట్బాల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎంవి రమణ, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం సాంబమూర్తి, సలహాదారు పి.సుందర్ రావు, అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు మెట్ట తిరుపతిరావు, అసోసియేషన్ సభ్యులు ఢిల్లీ, ఆనంద కిరణ్, రాజగోపాల్, సభ్యులు, మేనేజర్లు కోచ్ లు పాల్గొన్నారు.

# శ్రీ అద్దేపల్లి ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి) లో రిక్రూట్‌మెంట్ డ్రైవ్



**జనదీపిక,పాలకొల్లు :** పాలకొల్లు శ్రీ ఏ యస్ యన్ యం ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి) ఆధ్వర్యంలో దివిస్ లాబొరేటరీస్ లిమిటెడ్ సంస్థ సంయుక్త నిర్వహణ లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను 16-09-2026 న ఉదయం 11.00 గంటలకు కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా కె రత్నమాణిక్యం తెలిపారు. విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించాలనే ఉద్దేశం తో ఈ క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహి స్తున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ నియామక ప్రక్రియ లో ట్రైనీ సూపర్‌వైజర్ / గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. బి ఎస్సీ కెమిస్ట్రీ, బి ఎస్సీ (అన్ని స్ట్రీమ్‌లు), బి కామ్, బి ఏ, ఎం ఎస్సీ కెమిస్ట్రీ, బి ఫార్మసీ/ఎం ఫార్మసీ, బి టెక్ (కెమికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్/మెకానికల్) తదితర అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంబంధిత పోస్టులకు సంస్థ నిబంధనల ప్రకారం పురుష ,మహిళా అభ్యర్థులకు అర్హతలు వర్తిస్తాయని తెలిపారు.విద్యార్థులు అవసరమైన విద్యార్హత ధ్రువపత్రాలు, మార్కుల మెమోలు, అప్‌డేటెడ్ రెజ్యూమ్ మరియు ఆధార్ తదితర పత్రాలతో కళాశాల ప్రాంగణానికి హాజరై ఉద్యోగ ఎంపిక ప్రక్రియలో పాల్గొనాలని ప్రిన్సిపాల్ డా కె రత్నమాణిక్యం సూచించారు.

ఈ సందర్భంగా డివీస్ ల్యాబొరేటరీస్ క్యాంపస్ రిక్రూట్ మెంట్ డ్రైవ్‌కు సంబంధించిన బ్రోచర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డా కె రత్న మాణిక్యం, ఆదేపల్లి మోహన్‌దాస్, డా యశ్వీ రంగారావు, వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ, జె కె సి కోఆర్డినేటర్ కె శామ్యూల్, ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్ డా బూసి వెంకటస్వామి, అకాడమిక్ కోఆర్డినేటర్ జి సుమలత ,జె కె సి సభ్యులు డా వి డి విజయలక్ష్మి, బి మన్మధరావు, శిరీషా, జి డి శ్రీనివాసరావు,ఆఫీస్ సూపరింటెండెంట్ కె కనకలక్ష్మి ,యూడీసీ రమణమూర్తి తదితరులతో కలసి విడుదల చేశారు.

# శ్రీ అద్దేపల్లి ప్రభుత్వ కళాశాలలో బాలికలకు దాతల సహకారం తో యూనిఫాం పంపిణీ

**జనదీపిక,పాలకొల్లు :** స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి స్వయం ప్రతిపత్తి ప్రభుత్వ కళాశాల, పాలకొల్లు నందు గురువారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రత్న మాణిక్యం అధ్యక్షతన బాలికలకు ఉచిత యూనిఫాంల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సి పి డి సి సభ్యులు, కళాశాల వ్యవస్థాపకులు అద్దేపల్లి సత్యనారాయణమూర్తి మనుమడు (గ్రాండ్ సన్), అద్దేపల్లి గంగరాజు సత్రం వ్యవస్థాపక చైర్మన్ శ్రీ అద్దేపల్లి మోహన్ దాస్(75 మంది బాలికలకు), అలాగే కళాశాల పూర్వ విద్యార్థి, విజయ డయోగ్నస్టిక్ ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణ (25 మంది బాలికలకు) సహకారంతో కళాశాలలో చదువుతున్న వందమంది బాలికలకు ఉచితంగా యూనిఫాంలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో సి పి డి సి సభ్యులు డా ఎస్ వి రంగారావు, నిమ్మకాయల సత్యనారాయణ,వైస్ ప్రిన్సిపల్ టి కృష్ణ, ఐ క్యు ఏ సి కోఆర్డినేటర్ డా బూసి వెంకటస్వామి, అకాడమిక్ కోఆర్డినేటర్ జి సుమలత, జంతు శాస్త్ర విభాగాధిపతి డా ఎం రామకృష్ణ, జెకెసి కోఆర్డినేటర్ కె శామ్యూల్, స్టూడెంట్ కౌన్సిల్ కన్వీనర్ డా వి డి వి విజయలక్ష్మి, శ్రీరామ్ నరేంద్ర, శేఖర్, షమీమ్,ఆర్ షణ్ముఖరావు, సునీల్ కుమార్, జీ డి శ్రీనివాస్,పి శ్రీనివాస్ రావు , ఏ వంశీ సుబ్బరాయన్, సిహెచ్ రవికుమార్, కె పార్థసారథి,వి శిరీష తదితర అధ్యాపకులు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

# బీసీల సంక్షేమం, రాజ్యాధికారానికి తెలుగుదేశం పార్టీయే చిరునామా

**-శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్**



**జనదీపిక,నర్సీపట్నం :** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీలకు రాజకీయ ప్రాధాన్యత, రాజ్యాధికారం కల్పిస్తూ వారి అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ స్పష్టం చేశారు. నర్సీపట్నంలో అత్యంత ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగిన “జైహో బీసీ” సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు హయాంలో బీసీలకు దక్కిన రాజ్యాధికారాన్ని, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అదే స్ఫూర్తితో కొనసాగిస్తున్నారని ఆయన ప్రశంసించారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి, సుమారు 16,800 మంది బీసీ నాయకులకు పదవులు దక్కకుండా చేసిన గత ప్రభుత్వ తీరును ఆయన తీవ్రంగా ఎండగట్టారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించి బీసీల పట్ల తమ చిత్తశుద్ధిని నిరూపించుకుందని హర్షం వ్యక్తం చేశారు.

తెలుగుదేశం పార్టీ అధిష్టానం బీసీలకు కీలక పదవులు కట్టబెట్టి గౌరవించిందని ఆయన గుర్తుచేశారు. ఉత్తరాంధ్ర ముద్దు బిడ్డ చింతకాయల అయ్యన్న పాత్రుడికి శాసనసభా పతిగా, కింజరాపు రామ్మోహన్ నాయుడికి కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, అలాగే పల్లా శ్రీనివాసరావుకు రాష్ట్ర పార్టీ అధ్యక్ష బాధ్యతలతో పాటు రాజ్యసభ ప్రాతినిధ్యం కల్పించడం బీసీల పట్ల పార్టీకున్న నిబద్ధతకు నిదర్శనమని గొండు శంకర్ పేర్కొన్నారు. ఆర్థికంగా బీసీలను బలోపేతం చేసే దిశగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ఏకంగా రూ.51,000 కోట్లను కేటాయించిందని, గతంలోనూ రూ.35,000 కోట్లు, రూ.47,000 కోట్లతో బీసీల సంక్షేమానికి పెద్దపీట వేసిందని ఆయన వివరించారు. ఆదరణ పథకానికి రూ.1,000 కోట్లు కేటాయించడంతో పాటు, నేతన్నలకు రూ.25,000 ఆర్థిక సాయం, 200 నుంచి 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మరియు మద్యం దుకాణాల కేటాయింపుల్లో చేతి వృత్తుల వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పించడం వంటి విప్లవాత్మక నిర్ణయాలను ఆయన ఈ సందర్భంగా సభాముఖంగా తెలియజేశారు. రాష్ట్రంలోని బీసీలంతా ఎల్లప్పుడూ తెలుగు దేశం పార్టీకి, చంద్రబాబు నాయుడికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. సభా కార్యక్రమం ముగింపు సందర్భంగా, శాసనసభాపతి అయ్యన్నపాత్రుడి కుమారుడు రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ ఎమ్మెల్యే గొండు శంకర్ గారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, భారీ సంఖ్యలో బీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్ రద్దు చేయాలని ఎమ్మెల్యే లలిత కుమారికి ఉపాధి కూలీల వినతి



**జనదీపిక,ఎల్.కోట :** తమ గ్రామాలకు సంబంధించిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కరరావుపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే రద్దు చేసి, విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ శృంగవరపుకోట (ఎస్.కోట) శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారికి పలు గ్రామాల ఉపాధి హామీ కూలీలు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా చింతదిమ్మ, అర్ధనపాలెం, ఎర్రవానిపాలెం, గొల్లపేట, పాతసుంకరపాలెం మరియు అడ్డుపాలెం గ్రామాల పరిధిలోని గ్రూపు లీడర్లు, కూలీలు మాట్లాడు తూ... తమ ఫీల్డ్ ఆఫీసర్ భాస్కరరావుపై ఎవరో కావా లని, వాస్తవాలు తెలుసు కోకుండా తప్పుడు ఫిర్యాదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 సంవత్స రాలుగా ఆయన తమ ప్రాంతంలో ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నారని, ఈ కాలంలో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా సమర్థవంతంగా విధులు నిర్వహి ంచారని గుర్తుచేశారు. నిరాధారమైన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకొని ఆయనపై చర్యలు తీసుకోవడం సరి కాదని, వెంటనే ఆ ఫిర్యాదును తొలగించి, సస్పెన్షన్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు. తమ విన్న పాన్ని పరిశీలించి ఫీల్డ్ ఆఫీసర్‌కు న్యాయం చేయాలని కూలీలు విజ్ఞప్తి చేశారు.

# మహిళల భద్రతకు నారీశక్తి ఎంతో కీలకం

**-మందస ఎస్సై కృష్ణ ప్రసాద్**



**జనదీపిక,మందస :** మహిళలు, బాలికల్లో ఆత్మ విశ్వాసం, స్వీయ రక్షణ, హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిం చడంతో పాటు మహిళల భద్రతకు సంబంధించిన పోలీసు సేవలను సద్వినియోగం చేసుకునేలా చైతన్యం కల్పించడమే నారీశక్తి కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మందస ఎస్సై కృష్ణ ప్రసాద్ తెలిపారు. మందస మండలం హరిపురంలోని ప్రైవేటు కళాశాలలో నిర్వహించిన నారీశక్తి కార్యక్రమంలో ఎస్సై కృష్ణ ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. మహిళలు, బాలికలు వేధింపులు, హింస, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని, తమ హక్కులను తెలుసుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా రామ మోహన్ రావు మాస్టర్ జన్మదిన వేడుకలు



**జనదీపిక పార్వతీపురం :** పార్వతీపురం పట్టణానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ కంచు మోజు రామ మోహన్ రావు మాస్టర్ జన్మదిన వేడుకలు స్థానిక ఎస్.ఎన్.ఎం నగర్ లో గల వారి నివాసం వద్ద ఘనంగా జరి గాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి పి బ్రహ్మాజీరావు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామ మోహన్ రావు మాస్టర్ తన జన్మదిన వేడుకలను కేవలం ఆర్భాటాలకు పరిమితం చేయకుండా విద్యార్థులకు ఉపయోగపడే ముస్తాబు కిట్లను నా చేతుల మీదగా పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 220 మంది విద్యార్థులకు పుస్తకాలు, పిల్లలకు ఉపయోగపడే ప్లేట్లు, ఇతర విద్యా, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు కంచుమోజు రామ మోహన్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు అవసరమైన వస్తువులు అందించడం ద్వారా వారికి కొంతైనా తోడ్పాటు అందుతుందని అన్నారు. జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులను పంపిణీ చేయడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే పార్వతీపురం లైన్స్ క్లబ్ వారు నిర్వహిస్తున్న అక్షయపాత్ర ద్వారా ప్రభుత్వ ఆసుపత్రిలో అన్న ప్రసాద వితరణ చేశారు. రామమోహన్‌రావు చేపడుతున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని వారు అభినందించారు. అలాగే కురుపాం నియోజకవర్గం , కొమరాడ మండలం, విక్రమపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో కిచెన్ షెడ్ నిమిత్తం అడ్వాన్స్ గా రూ.25,000 రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జామి నారాయణ స్వామి,మండల విద్యాశాఖ అధికారి( 2) మజ్జి గౌరీ శంకరరావు,పాలకొండ జల్లునారాయణ రావు,జల్లు బాబ్జి, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ జల్లు వినయ్, మేరు వెంకట్రావు,పొట్నూరు గౌరీ శంకర్రావు, రాగాల శ్రీనివాసరావు, నరేష్, ప్రకాష్, గోపాల్, చెరుకూరి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

జనదీపికలో ప్రకటనలు కొరకు సంప్రదించండి
8106823459

# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

**-హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే గొండు శంకర్**



**జనదీపిక,శ్రీకాకుళం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వినాయక చవితి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసే ప్రతీ గణేష్ మండపానికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని తీసుకున్న నిర్ణయం పట్ల ఎమ్మెల్యే గొండు శంకర్ తీవ్ర హర్షం వ్యక్తం చేశా రు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించడం ఉత్సవ నిర్వాహకులకు, భక్తులకు ఒక గొప్ప శుభవార్త అని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ ఛార్జీల భారం లేకుండా ఉత్సవ కమిటీలు, యువత, భక్తులు మరింత ఉత్సాహంగా ,వైభవంగా గణేష్ వేడుకలు జరుపుకోవాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం అత్యంత అభినందనీయమని ఆయన కొనియాడారు. భక్తుల మనోభావా లను గౌరవించి, పండుగలను ఎటువంటి ఆటంకాలు లేకుండా ఘనంగా నిర్వహించుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ పూర్తి మద్దతుగా నిలుస్తుందని ఈ నిర్ణయం ద్వారా స్పష్టమైందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని వినాయక మండపాలకు ఈ గొప్ప సదుపాయాన్ని కల్పించిన ప్రభుత్వ పెద్దలకు, ముఖ్యంగా ఈ నిర్ణయాన్ని సాకారం చేసిన మంత్రి నారా లోకేశ్ కి గొండు శంకర్ తన తరపున, నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వినాయక చవితి సందర్భంగా ప్రజలందరూ పర్యావరణ హితమైన మట్టి వినాయకులను ప్రతిష్టించి, పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# పెన్షన్లు గడువు పెంచాలి



**జనదీపిక పార్వతీపురం :** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతన పెన్షన్లు పెట్టేందుకు ఇచ్చిన గడువును సెప్టెంబర్ 30 వరకు గడువు పెంచాలని లిబరేషన్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సంఘం కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు అయ్యి రెండున్నర సంవత్సరాలు సమయంలో కొత్త పెన్షన్లు పెట్టేందుకు ఇచ్చిన గడువు ఈనెల 16 తో ముగియమనిందని, ఆ గడువు కాలాన్ని ఈనెల 30 వరకు పొడిగించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా హరిజన గిరిజన బడుగు బలహీన వర్గాల వారికి సకాలంలో కావలసిన పత్రాలు సమర్పించడానికి కొంతమేరకు వెసులుబాటు కావాలని ఆయన కోరారు. ప్రభుత్వము పేద ప్రజల కోసం ఆలోచించి పెన్షన్ నూతనంగా పెట్టుకునే వారికి ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఈ విషయమే పార్వతీపురం మండలంలో గల గంగాపురం గ్రామ సచివాలయానికి వెళ్లి అక్కడ అడ్మిన్ తో మాట్లాడి ఆయన వివరించారు. ఆయనతో పాటు వెలమల సత్యనారాయణ పాల్గొన్నారు.

# విద్యను బోధించే ఉపాధ్యాయ పోస్టులను అమ్ముకోవడం సిగ్గుచేటు : ఏఐవైఎఫ్



**జనదీపిక,శ్రీకాకుళం :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేసిన డీఎస్సీ ఉద్యోగాల భర్తీలో స్పోర్ట్స్ కోటా లో తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించి అనేక ఉపాధ్యాయ పోస్టులు అమ్ముకొని కష్టపడి చదువుకున్న నిజమైన అభ్యర్థులను నారా లోకేష్ మోసం చేశారని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ లు అన్నారు. ఈరోజు శ్రీకాకుళం క్రాంతి భవన్ లో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ శాప్ పైన అదేవిధంగా క్రీడా అసోసియేషన్ ల పైన పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామక ప్రక్రియపై అభ్యర్థుల్లో అనేక అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో నారా లోకేష్ ప్రతిపక్షాల సవాళ్లు కు స్పష్టమైన వైఖరిని తెలియజేయాలని వారు డిమాండ్ చేశారు. సంవత్సరాల తరబడి ప్రభుత్వ ఉద్యోగం కోసం లక్షలాది మంది నిరుద్యోగ యువత ఎంతో కష్టపడి చదివి డీఎస్సీ రాస్తే అలాంటి నియామక ప్రక్రియలో చిన్నపాటి అనుమానం వచ్చినా ప్రభుత్వం దానిని తీవ్రంగా పరిగణించి పూర్తి పారదర్శకతతో వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన బాధ్యత ఉందని అభ్యర్థుల అనుమానాలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. డీఎస్సీ పరీక్షలు, ఫలితాలు, మెరిట్, ఎంపిక ప్రక్రియకు సంబంధించి అభ్యర్థులు లేవనెత్తుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రజలను అయోమ యానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. టెట్ క్వాలిఫై అవ్వని అభ్యర్థులకు కూడా ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించి అభ్యర్థులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు. నియామక ప్రక్రియలో ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారా ఎవరైనా అక్రమాలకు పాల్పడ్డారా అధికారుల స్థాయిలో నిర్లక్ష్యం లేదా అవకతవకలు జరిగాయా అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని నోటిఫికేషన్ నుంచి నియామక ఉత్తర్వుల వరకు ప్రతి దశ పారదర్శకంగా జరిగిందని ప్రభుత్వం నిరూపించగలదా అని వారు ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రక్రియపై నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడితే దాని ప్రభావం ఒక్క డీఎస్సీ అభ్యర్థులపైనే కాదని , భవిష్యత్తులో జరిగే అన్ని ప్రభుత్వ నియామకాలపై పడుతుందని డీఎస్సీ ప్రక్రియలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు నిజమైతే బాధ్యులెవరైనా సరే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆరోపణలు నిరాధారమైనవైతే కూడా ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి, అన్ని అనుమానాలకు శాశ్వతంగా తెరదించాలని కోరారు. పరీక్ష నిర్వహణ నుంచి ఫలితాలు, మెరిట్ లిస్ట్, ఎంపిక వరకు జరిగిన ప్రతి దశను పారదర్శకంగా వెల్లడించాలని అభ్యర్థులు లేవనెత్తిన అభ్యంతరాలపై అధికారికంగా సమాధానం ఇవ్వాలని అక్రమాలు రుజువైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అక్రమాల కారణంగా నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని భవిష్యత్ నియామకాల్లో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు వై వేణు, హేమంత్, వసంతరావు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష రద్దు చేయాలి : ఏపీటీఎఫ్



**జనదీపిక,ఇచ్ఛాపురం :** విద్యా హక్కు చట్టానికి ముందు ఉపాధ్యాయ ఉద్యోగంలో నియమించబడిన ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షులు చావలి శ్రీనివాస్ మరియు ప్రధాన కార్యదర్శి పప్పల తిరుమలరావు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు అప్పటికి ఉన్న నిబంధనలు మేరకు అన్ని అర్హతలు పొంది ఉపాధ్యాయ నియామకం పొందారని, ఇప్పుడు టెట్ పరీక్ష పాస్ అవ్వాలని రెట్రాస్పెక్టివ్ గా అమలు చేయడం దారుణమని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్లో ఉన్న వివిధ ఆర్థికపరమైన అంశాలను ప్రభుత్వం విస్మరించిందని పనిభారాన్ని పెంచుతూ బోధనకు దూరం చేసే యాప్ల రద్దును కోరుతున్నామని ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ఇచ్ఛాపురం మండల శాఖ అధ్యక్షులు చింతాడ శ్రీహరి, ప్రధాన కార్యదర్శి జాడు నాగేశ్వరరావు, ఈ మేరకు ఒక ప్రకట విడుదల చేశారు. ఈరోజు జిల్లా అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం మండలం , బలరాంపురం, ధర్మపురం, ఈదుపురం, లొద్దపుట్టి, కె శాసనం, జగన్నాధపురం, కొలిగాం ,మండపల్లి, బూర్జిపాడు మరికొన్నిపాఠశాలలో సందర్శనలో ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలు తెలుసు కోవడం జరిగింది. ఉద్యోగుల జిల్లాల వారి విభజన ప్రక్రియ ఆలస్యం అవుతున్నది కనుక వెంటనే ప్రమోషన్ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుమారు మూడు సంవత్సరాల కాల పరిమితి దాటినప్పటికిని, పి ఆర్ సి లేదు కనుక తక్షణమే 30% మధ్యంతర భృతి విడుదల చేయాలని, పెండింగ్లో ఉన్న డి ఏ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని జిల్లా అధ్యక్షులు చావలి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి.తిరుమలరావు తెలియజేశారు. ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ఒక నిబద్ధతగల వైఖరితో పనిచేస్తుందని సభ్యులు తెలియజేశారు. సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యా యుల, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమమే శరణ్యం అన్నారు. ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష రద్దు చేయకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చావలి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి పి తిరుమలరావు, జిల్లా కార్యదర్శి ఎస్ చాణక్య, సీనియర్ నాయకులు బల్లెడ లక్ష్మణమూర్తి, మండల అధ్యక్షులు చింతాడ శ్రీహరి ప్రధాన కార్యదర్శి జాడు నాగేశ్వరరావు , సీనియర్ నాయకులు సదాశివుని శంకరరావు, కె పాపారావు, కెల్లి మోహన రావు మొదలగువారు పాల్గొన్నారు.

Edited,Printed, Published and owned by Chinna Rao Sunnapu, Printed at Dinesh Printers,D.No.7-6-7,Reddika Street,Near Durgamma Temple ,Srikakulam 532 001 .Andhra Pradesh.
Published at : D.No.7-6-7,Reddika Street,Near Durgamma Temple ,Srikakulam 532 001 .Andhra Pradesh. AP TEL:/2017/73004 Editor : Chinnarao Sunnapu .janadheepikasklm@gmail.com Ph:8106823459.